www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

FLASH INDIA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2010/33229

సంపుటి : 17 | సంచిక :75 | ఆదివారం 19.04.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు :08 | వెల : రూ 2/-

**విలేకరులు కావలెను**


17 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

## విపక్షం తప్పు చేసింది..

- విపక్షం పెద్ద తప్పు చేసిందని అన్నారు
- ఆ తప్పుకు పర్యవసానాలు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు
- మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్నందుకు విపక్షమే మహిళలకు సమాధానం చెప్పాలని అన్నారు
- ఈ అంశంపై కేంద్ర మంత్రులతో ప్రత్యేకంగా చర్చించారు
- భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీ
- కానీ అందుకు తగ్గట్టుగా ఓట్లు రాలేదు

03



## ఇది ప్రజాస్వామ్య విజయం..

- బీజేపీ శాశ్వత అధికారానికి కుట్ర చేసిందని ఆరోపించారు
- ఆ కుట్రను విపక్షాలు అడ్డుకున్నాయని చెప్పారు
- విపక్షాలు ఏకమైతే ప్రభుత్వం ఓడిపోతుందని అన్నారు
- మహిళా బిల్లును వేరుగా మళ్లీ తీసుకురావాలని డిమాండ్ చేశారు
- కేంద్రం ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయాలని చూసిందని విమర్శించారు
- కాంగ్రెస్‌ను మహిళా వ్యతిరేకులుగా చూపించాలని బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు

02



## విపక్షాలది 'సెల్ఫ్ గోల్'..

- సీట్ల ఫ్రీజ్ కొనసాగించడం దక్షిణానికి ప్రయోజనకరమని చెప్పారు
- విపక్షాలు ఇది గుర్తించలేకపోయాయని విమర్శించారు
- అంతర్గత వలసలు ఒక పరిష్కారమని సూచించారు
- అన్ని పార్టీలు కలిసి పరిష్కారం కనుగొనాలని కోరారు
- 131వ రాజ్యాంగ సవరణ బిల్లు విఫలంపై ఆందోళన వ్యక్తం
- తమిళనాడు, కేరళ, ఆంధ్ర, తెలంగాణ వంటి రాష్ట్రాలు సీట్లు కోల్పోతాయి

02



# బిల్లుకు మేం వ్యతిరేకం కాదు

## మహిళా రిజర్వేషన్ బిల్లు నిజాయితీగా తీసుకురాలేదు

**ముసుగు రాజకీయాలు వద్దు.. మహిళా రిజర్వేషన్లు వెంటనే అమలు చేయండి**

- మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ అమలుకు యత్నం
- చిన్న చిన్న సవరణలతో మహిళా బిల్లు మళ్లీ పెట్టండి
- సోమవారమే మళ్లీ మహిళా బిల్లు ఒక్కటే ప్రవేశపెట్టాలి
- ఇండి కూటమి మద్దతిస్తుంది..
- దక్షిణాది సపోర్టు చేసేలా నేను చూస్తా
- ఢిల్లీలో మీడియాతో స్పష్టం చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- మహిళా రిజర్వేషన్లపై కేంద్రంపై రేవంత్ రెడ్డి విమర్శలు
- బిల్లు వీగిపోవడం చిత్తశుద్ధి లోపమా?
- డిలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం?



వాళ్లకు పట్టిన పరిస్థితే చంద్రబాబుకు..

పూర్తి సమాచారం 2లో

## హైదరాబాద్ ఈవీ హబ్..

- బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ప్రతిపాదన
- హైదరాబాద్‌ను ఈవీ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యం
- హైడ్రోజన్ టెక్నాలజీ, రోబోటిక్స్‌పై ఫోకస్
- 2034 నాటికి కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్
- ఢిల్లీలో కేంద్రమంత్రితో ప్రత్యేకంగా భేటీ
- స్క్రాప్ తో ఉక్కును రీసైక్లింగ్ చేసే పరిశ్రమ ఏర్పాటుకు అభ్యర్థన

**న్యూఢిల్లీ :**
తెలంగాణ పారిశ్రామిక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా కీలక అడుగులు వేశారు. శనివారం కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి , సహాయ మంత్రి శ్రీనివాస వర్మలతో భేటీ అయిన ముఖ్యమంత్రి, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిష్టాత్మక ప్రతిపాదనలను వారి ముందుంచారు. ముఖ్యంగా బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ పరిశ్రమ స్థాపన ద్వారా ఉక్కు కొరత తీరడమే కాకుండా, పర్యావరణానికి ఎంతో మేలు చేకూరుతుందని ఆయన వివరించారు.



## హైబ్రిడ్ కాదు క్రాస్ బ్రీడ్ సిద్ధాంతం..

### రేవంత్ రెడ్డి పోవాలి, కేసీఆర్ రావాలి

**జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరికతో పార్టీకి బలం**

- తెలంగాణను పాకిస్తాన్ విభజనతో పోల్చడం తప్పు అన్నారు
- తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని విమర్శించారు
- బీజేపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు
- బీఆర్ఎస్ ఎంపీలు ఉంటే గట్టిగా సమాధానం ఇచ్చేవాళ్లమన్నారు
- కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు స్పందించలేదని విమర్శించారు
- రేవంత్ రెడ్డి–బీజేపీ మధ్య సాన్నిహిత్యం ఉందని ఆరోపించారు
- మహిళా బిల్లును రాజకీయాల కోసం మాత్రమే తీసుకువచ్చారు

02

అదే రాజ్యసభలో ఉన్న ముగ్గురు బీఆర్ఎస్ ఎంపీలు మాత్రం ప్రాజెక్టులపై అవాకులు చవాకులు పేలిన కేంద్ర జల వనరుల మంత్రికి దీటైన సమాధానం ఇచ్చారని స్పీకర్‌ను కలిసి ఆధారాలు చూపించి రికార్డులను సైతం సవరించారన్నారు. రేవంత్ రెడ్డి, బీజేపీ మధ్య ఉన్న బడే భాయ్ ఛోటే భాయ్ బంధం మరోసారి బట్టబయలైందని దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకుల ఇళ్లను ముట్టడించాలని బీజేపీ పిలుపునిస్తే.. రేవంత్ రెడ్డి మాత్రం ఢిల్లీలో బీజేపీ కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ ఇంటికి భోజనానికి వెళ్లారని విమర్శించారు. కార్యకర్తలేమో కొట్లాడుకోవాలి.. మీరేమో విందులు చేసుకోవాలా? అని నిలదీసారు.

## సీఎం ఇంటి ముట్టడికి యత్నం..

**జూబ్లీహిల్స్‌లో బీజేపీ మహిళా మోర్చా గర్జన**

మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి నాయకత్వంలో వందలాది మంది మహిళా కార్యకర్తలు నిరసన
జూబ్లీహిల్స్ రోడ్లన్నీ బారికేడ్లతో మూసివేసి భారీ బందోబస్తు

02

## బీజేపీ నియంతృత్వానికి చెక్ పెట్టినాం

బీజేపీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు
2023లో ఆమోదించిన బిల్లును అమలు చేయలేదని ప్రశ్నించారు
బీజేపీ మహిళలు, బీసీలకు న్యాయం చేయడం లేదన్నారు
తెలంగాణపై బీజేపీ వివక్ష చూపుతోందని ఆరోపించారు
ప్రతిపక్షాలు ఐక్యంగా కేంద్ర నిర్ణయాలను అడ్డుకుంటాయని తెలిపారు

03






## కాలి బూడిదైన ఏసీ స్లీపర్ బస్సు..

హైదరాబాద్ నగరంలో శుక్రవారం రాత్రి జరిగిన భారీ బస్సు ప్రమాదం కలకలం రేపింది. మియాపూర్ నుంచి పాలకొల్లుకు వెళ్తున్న 'శ్రీ దుర్గా మహేశ్వరి ట్రావెల్స్'కు చెందిన ఏసీ స్లీపర్ బస్సు, కెపిహెచ్‌బి పరిధిలోని పద్మావతి ప్లాజా బస్ స్టాప్ వద్దకు చేరుకోగానే మొదట బస్సు డ్రైవర్ క్యాబిన్ నుండి పొగలు వచ్చాయి. మంటలను గమనించిన డ్రైవర్, క్లీనర్ వెంటనే అప్రమత్తమయ్యి, బస్సును పక్కకు ఆపి, అందులో ఉన్న 18 మంది ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించేశారు. ప్రయాణికులు ప్రాణాలతో బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

05

## దక్షిణాదికి కాంగ్రెస్ చారిత్రక ద్రోహం..

**బయట దక్షిణాది గౌరవం అంటూనే, లోపల బిల్లును అడ్డుకున్నారు**



- 2026 తర్వాత డీలిమిటేషన్ వల్ల దక్షిణాది ప్రాధాన్యం తగ్గే ప్రమాదం
- జనాభా నియంత్రించిన రాష్ట్రాలకు నష్టం
- ఈ ముప్పు నుంచి రక్షించేందుకు బిల్లు తీసుకువచ్చామని తెలిపారు
- అమిత్ షా ఇచ్చిన హామీని విపక్షాలు పట్టించుకోలే
- మహిళలకు న్యాయం చేసే బిల్లును అడ్డుకున్నారు
- విపక్షాలు రాజకీయ స్వార్థంతో వ్యవహరిస్తున్నాయని అన్నారు
- ప్రజలు ఈ విషయాన్ని గుర్తుంచుకుంటారని చెప్పారు
- కాంగ్రెస్, ఇండి కూటమి దక్షిణాది రాష్ట్రాలకు ద్రోహం చేశాయని ఆరోపించారు

03

2026 తర్వాత జరగబోయే నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలు తమ రాజకీయ ప్రాధాన్యతను కోల్పోయే ప్రమాదం ఉందని బండి సంజయ్ హెచ్చరించారు. జనాభాను నియంత్రించి, విద్య, అభివృద్ధిపై పెట్టుబడి పెట్టిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల గొంతు నొక్కేలా సీట్ల సర్దుబాటు జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ముప్పు నుండి దక్షిణాదిని కాపాడేందుకు ఎన్డీయే ప్రభుత్వం ఒక రక్షణ కవచంలా 131వ సవరణ బిల్లును తెచ్చిందని, కానీ విపక్షాలు దానిని అడ్డుకుని రాజకీయ స్వార్థాన్ని ప్రదర్శించాయని మండిపడ్డారు.



# సీఎం ఇంటి ముట్టడికి యత్నం..

## జూబ్లీహిల్స్‌లో బీజేపీ మహిళా మోర్చా గర్జన

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** పార్లమెంట్‌లో మహిళా బిల్లుల విషయంలో కాంగ్రెస్ అనుసరిస్తున్న తీరుకు నిరసనగా నేడు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45 రణరంగంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడించేందుకు బీజేపీ మహిళా మోర్చా కార్యకర్తలు భారీ ఎత్తున తరలిరావడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి నాయకత్వంలో వందలాది మంది మహిళా కార్యకర్తలు నిరసన ప్రదర్శనగా ముఖ్యమంత్రి ఇంటి వైపు దూసుకెళ్లారు. వీరి రాకపై ముందుగానే సమాచారం అందుకున్న పోలీసులు జూబ్లీహిల్స్ రోడ్లన్నీ బారికేడ్లతో మూసివేసి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే.. మహిళా నేతలు పోలీసుల బారికేడ్లను తో-సుకుంటూ ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర తోపులాట, వాగ్వాదం జరిగింది. పోలీసుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ రోడ్డుపైనే బైఠాయించిన మహిళా కార్యకర్తలను పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్లి వాహనాల్లోకి ఎక్కించారు. శిల్పారెడ్డి సహా పలువురు ముఖ్య నేతలను అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా.. నారీశక్తికి ద్రోహం చేసిన కాంగ్రెస్ నశించాలి అంటూ మహిళా మోర్చా నేతలు చేసిన నినాదాలతో జూబ్లీహిల్స్ మార్మోగింది. అరెస్ట్ సమయంలో శిల్పారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతుంటే పోలీసులతో అణచివేయాలని చూడటం హేయమైన చర్య అని విమర్శించారు. మహిళలకు దక్కాల్సిన రిజర్వేషన్లను అడ్డుకున్న కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ ముట్టడి యత్నం నేపథ్యంలో జూబ్లీహిల్స్ పరిసర ప్రాంతాల్లో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది.

# వాళ్లకు పట్టిన పరిస్థితే చంద్రబాబుకు..



**ఢిల్లీ :** బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీల మనుగడ భవిష్యత్తులో కష్టంగా ఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. తెలుగుదేశం, చంద్రబాబు నాయుడు పరిస్థితి కూడా అలాగే అవుతుందని పేర్కొన్నారు. నితీశ్ కుమార్, ఏక్ నాథ్ షిండేల పరిస్థితి మనం ఇప్పుడు చూస్తున్నామని తెలిపారు. ఈరోజు(శనివారం) ఢిల్లీలో మీడియాతో సీఎం చిట్‌చాట్ చేశారు. ప్రస్తుతం బీజేపీకి కేంద్రంలో సీట్లు తక్కువగా ఉండటంతో.. టీడీపీకి ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. లోక్‌సభ, రాజ్యసభ ఉన్నది చట్టాలు చేయడానికి మాత్రమేనని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. వాటిని అమల్లోకి తీసుకువచ్చేది స్థానికంగా ఉండే రాష్ట్ర ప్రభుత్వాలు, అధికార యంత్రాంగమని తెలిపారు. 2/3 మెజార్టీ వచ్చినంత మాత్రాన అన్నింటిని చట్టాలు చేయలేమని పేర్కొన్నారు. కేంద్రంలో మెజార్టీ ఉందని ప్రధానిగా ఉన్న ఎవరైనా తనకు తాను రాజుగా 2/ 3వ వంతు మెజార్టీతో చట్టం చేసుకుంటే ఎవరూ ఒప్పుకోరు కదా అని ప్రశ్నించారు. డిక్టేటర్‌షిప్‌ని ఎవరు ఒప్పుకోరని చెప్పారు. ఏపీలో ప్రతిపక్షానికి కేవలం 11 సీట్లే ఉన్నాయని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళలకు కేంద్రం రిజర్వేషన్ కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# విపక్షాలది 'సెల్ఫ్ గోల్'..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దేశంలో నియోజకవర్గాల పునర్విభజన , మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో విఫలం కావడంపై లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ శత్రుత్వం తో విపక్షాలు ఈ బిల్లును అడ్డుకోవడం వల్ల దక్షిణాది రాష్ట్రాలు తమ రాజకీయ ప్రాబల్యాన్ని భారీగా కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ బిల్లు ఆగిపోవడంతో ఇకపై లోక్‌సభ సీట్ల కేటాయింపు 2026 జనాభా లెక్కల ఆధారంగానే జరుగుతుందని, ఇది జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలకు శాపంగా మారబోతుందని ఆయన విశ్లేషించారు.

**రాష్ట్రాల వారీగా సీట్ల కోత అంచనా..**

జేపీ విశ్లేషణ ప్రకారం, కొత్త నియోజకవర్గాల విభజన వల్ల ఏడు రాష్ట్రాలు ఏకంగా 35 లోక్‌సభ స్థానాలను కోల్పోయే అవకాశం ఉంది. ఇందులో తమిళనాడు 10 సీట్లు, కేరళ 7 సీట్లు, ఆంధ్రప్రదేశ్ 5 సీట్లు, తెలంగాణ-3 సీట్లు, ఒడిశా, పశ్చిమ బెంగాల్ 4 సీట్లు, కర్ణాటక 2 సీట్లు కోల్పోయే అకవాశం ఉంది. అలాగే ఉత్తరాదిలోని నాలుగు రాష్ట్రాలు (యూపీ, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్) కలిపి సుమారు 34 కొత్త సీట్లను పొందే అవకాశం ఉంది. ఇది దేశ రాజకీయ సమతుల్యతను దెబ్బతీస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**విపక్షాల 'అనాలోచితం'**

ప్రస్తుతమున్న సీట్ల సంఖ్యను 1971 జనాభా లెక్కల ప్రకారమే 'ఫ్రీజ్' చేసేందుకు ఎన్డీయే ప్రభుత్వం ముందుకు రావడం దక్షిణాది రాష్ట్రాలకు ఒక అయాచిత వరమని, కానీ విపక్షాలు దీనిని గుర్తించడంలో విఫలమయ్యాయని జేపీ విమర్శించారు. రాజకీయంగా బీజేపీకే ఎక్కువ లబ్ధి చేకూర్చే అవకాశం ఉన్నా, దేశ ప్రయోజనాల కోసం ప్రభుత్వం ఈ బిల్లును తెచ్చిందని.. అయితే విపక్షాలు దీనిని అడ్డుకోవడం "ముక్కు కోసుకుని శకునం మార్చుకున్నట్లు" ఉందని ఆయన అభివర్ణించారు. 2001లో వాజ్‌పేయి హయాంలో కూడా ఇలాంటి గడ్డు పరిస్థితుల్లోనే 84వ సవరణ ద్వారా సీట్ల ఫ్రీజ్‌ను మరో 25 ఏళ్లు పొడిగించడంలో తాను కీలక పాత్ర పోషించానని గుర్తు చేశారు.

**వలసలే పరిష్కారం - సమగ్ర దృక్పథం అవ-సరం..**

జనాభా అసమానతలకు 'అంతర్గత వలసలు' ఒక పరిష్కారమని, అమెరికా వంటి దేశాల్లో ఇది విజయవంతమైందని జేపీ సూచించారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా రాజకీయ పార్టీలు విద్వేషపూరిత వ్యాఖ్యలు మానుకుని, జాతీయ సమగ్రత, అభివృద్ధిపై దృష్టి పెట్టాలని జయప్రకాశ్ నారాయణ కోరారు. సీట్ల కేటాయింపు సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఉంటాయని, అన్ని పార్టీలు కలిసి ఒక ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుగొనాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# బిల్లుకు మేం వ్యతిరేకం కాదు

## మహిళా రిజర్వేషన్ బిల్లు నిజాయితీగా తీసుకురాలేదు

**ఢిల్లీ :** 131వ రాజ్యాంగ సవరణ బిల్లు పార్లమెంటులో వీగిపోవడంతో దేశానికి పెనుప్రమాదం తప్పిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన.. శనివారం ఉదయం కాంగ్రెస్ పెద్దలను కలిసి బిల్లు వీగిపోవడంపై ధన్యవాదాలు తెలిపారు. మధ్యాహ్నం ఢిల్లీలోనే మీడియాతో మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కీలక ప్రకటన చేశారు. బిల్లు వీగిపోవడం రాజకీయ ఓటమి కానేకాదని, బీజేపీ విధానాలకు జరిగిన ఓటమి అని అభివర్ణించారు. ఎన్డీఏ మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలుకు కుట్ర చేసిందని ఆరోపించారు. దక్షిణ భారతదేశానికి జరిగే అన్యాయాన్ని అడ్డుకున్నామని, మహిళా రిజర్వేషన్లను చిన్న సవరణలతో అమలు చేయవచ్చని సీఎం రేవంత్ తెలిపారు. రిజర్వేషన్లను తొలగించేందుకు కుట్ర జరిగిందని ఆరోపించారు. బీజేపీకి 400 సీట్లు వస్తే కచ్చితంగా రాజ్యాంగాన్ని మార్చివేసి ఉండేదన్నారు. మహిళా రిజర్వేషన్లపై తమకు చిత్తశుద్ధి ఉందని, తాము అందుకు వ్యతిరేకం కాదని సీఎం స్పష్టం చేశారు.

**దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత నాది..**

రాజకీయ అధికారం బీజేపీ దగ్గరున్నా.. ఆర్థిక వనరులు మాత్రం రాష్ట్రాల నుంచే అందుతున్నాయని గుర్తుచేశారు. ఉత్తరప్రదేశ్ ఎన్నికల లోపు 2023 నాటి మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే.. అందుకు మద్దతిచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకమన్నది అబద్ధమని, సోమవారం ప్రత్యేక పార్లమెంట్ సమావేశం ఏర్పాటు చేసి, మహిళా రిజర్వేషన్ బిల్లును మా-త్రమే ప్రవేశపెడితే ఇండికూటమి ఏకగ్రీవంగా మద్దతిచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. అందుకోసం దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించి తీసుకొచ్చే బాధ్యత తానే తీసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మహిళా రిజర్వేషన్లపై తమకూ చిత్తశుద్ధి ఉందని, ప్రజల్లో ఎవరికి మద్దతు ఉందో ప్రజాక్షేత్రంలో తేలుతుందన్నారు. కానీ మహిళా రిజర్వేషన్లలోనూ ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కోటాలు ఉండాలని డిమాండ్ చేశారు. సోమవారమే పార్లమెంటులో ఆమోదించి, సోమవారం నుంచే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని సూచించారు.

**మా మధ్య చిచ్చు పెట్టకండి..**

డీలిమిటేషన్ పేరుతో ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టొద్దని ప్రధాని నరేంద్రమోదీని కోరారు. తమకు రాజకీయాలకంటే దేశమే ముఖ్యమని తెలిపారు. మహిళా రిజర్వేషన్లను కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలకు ఓటు హక్కు తీసుకొచ్చిందే కాంగ్రెస్ పార్టీ అన్నారు. కాంగ్రెస్ హయాంలో ఇందిరాగాంధీ లాంటి గొప్పనేతలు దేశాన్ని నడిపించారని, బీజేపీ అధ్యక్ష పగ్గాలు ఇప్పటివరకూ మహిళలకు దక్కలేదని పోల్చి చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అన్ని అంశాల్లో మహిళలకు ప్రాధాన్యతనిచ్చిందన్నారు. డీలిమిటేషన్ తో పార్లమెంట్ సీట్లను 850కు పెంచి.. బీజేపీ శాశ్వతంగా అధికారంలో ఉండాలని పెద్దకుట్ర పన్నిందని రేవంత్ ఆరోపించారు.

# హైబ్రిడ్ కాదు క్రాస్ బ్రీడ్ సిద్ధాంతం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాజకీయ విలువలున్న సీనియర్ నేత జీవన్ రెడ్డి చేరికతో ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ కు మరింత బలం చేకూరుతుందని మాజీ మంత్రి, పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. జీవన్ రెడ్డి ఈ నెల 20వ తేదీన కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. ఇవాళ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు జగిత్యాలలో హరీశ్ రావు పర్యటించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ నెల 20న జగిత్యాలలో జరగబోయే బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జగిత్యాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలకు ఒక స్పష్టమైన క్లారిటీ వచ్చేసిందని 'రేవంత్ రెడ్డి పోవాలి, కేసీఆర్ రావాలి' అని ప్రజలు బలంగా కోరుకుంటున్నారు అనడానికి జీవన్ రెడ్డి గారి చేరిక ఒక సజీవ సాక్ష్యం అన్నారు.

**తేజస్వి సూర్య మాటలకు గుండెలు రగిలిపోతున్నాయి:**

నిన్న పార్లమెంటులో జరిగిన రెండు పరిణామాలు తెలంగాణ సమాజాన్ని తీవ్రంగా కలచివేశాయని హరీశ్ రావు అన్నారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ ఏర్పాటును ఇండియా పాకిస్తాన్ విభజనతో పోల్చడం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని తీవ్రంగా దెబ్బతీయడమేనన్నారు. ఆయన తన వ్యాఖ్యల పట్ల బేషరతుగా క్షమాపణలు చెప్పాల్సింది పోయి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆ వ్యాఖ్యలను వెనుకేసుకొచ్చే ప్రయత్నం చేయడం అత్యంత దుర్మార్గం అని మండిపడ్డారు. తేజస్వి సూర్య మాట్లాడిన మాటలు చూస్తుంటే తెలంగాణ ప్రజల గుండెలు రగిలిపోతున్నాయని కేసీఆర్ నాయకత్వంలో సకల జనులు పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కించపరు-స్తారా? అని నిలదీశారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం, లోక్‌సభ, రాజ్యసభలో బిల్లులు పాసై, రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా ప్రజాస్వామిక పద్ధతిలో తెలంగాణ ఏర్పడిందని గుర్తు చేశా-రు.

**మేమే ఉంటే మూతి పగిలే సమాధానం చెప్పేవాళ్లం:**

కనీస అవగాహన లేకుండా తెలంగాణపై, ఉద్యమంపై బీజేపీ నేతలు విషం చిమ్ముతున్నారని ఒక ఎంపీ తప్పు మాట్లాడితే ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం దాన్ని ఖండించాల్సింది పోయి సమర్థించడం దారుణం అన్నారు. బీజేపీ తక్షణమే తేజస్వి వ్యాఖ్యలపై బేషరతుగా క్షమాపణ చెప్పాలని లేదంటే తెలంగాణ మనోభావాలను దెబ్బతీసిన పార్టీగా బీజేపీ మిగిలిపోతుందన్నారు. నిన్నటి లోక్‌సభ సమావేశాల్లో బీఆర్ఎస్ ఎంపీలు లేని లోటు స్పష్టంగా కనిపించిందని మన ఎంపీలు సభలో ఉండి ఉంటే తేజస్వికి తెలంగాణ బిడ్డల తరపున దీటైన, మూతి పగిలే సమాధానం చెప్పేవాళ్లం అన్నారు. మన రాష్ట్రం నుంచి 8 మంది కాంగ్రెస్, 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా పెదవులు మూసుకొని మౌనంగా కూర్చున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుంటే ప్రశ్నించాల్సిన బాధ్యత మీపై లేదా? అని నిలదీశారు.

**కార్యకర్తలకు కొట్లాటలు.. మీకు విందులా?**

అదే రాజ్యసభలో ఉన్న ముగ్గురు బీఆర్ఎస్ ఎంపీలు మాత్రం ప్రాజెక్టులపై అవాకులు చవాకులు పేలిన కేంద్ర జల వనరుల మంత్రికి దీటైన సమాధానం ఇచ్చారని స్పీకర్‌ను కలిసి ఆధారాలు చూపించి రికార్డులను సైతం సవరించారన్నారు. రేవంత్ రెడ్డి, బీజేపీ మధ్య ఉన్న బడే భాయ్ ఛోటే భాయ్ బంధం మరోసారి బట్టబయలైందని దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకుల ఇళ్లను ముట్టడించాలని బీజేపీ పిలుపునిస్తే.. రేవంత్ రెడ్డి మాత్రం ఢిల్లీలో బీజేపీ కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ ఇంటికి భోజనానికి వెళ్లారని విమర్శించారు. కార్యకర్తలేమో కొట్లాడుకోవాలి.. మీరేమో విందులు చేసుకోవాలా? అని నిలదీసారు.

**హైబ్రిడ్ విధానం ఏంటో ఇవాళ స్పష్టమైంది:**

డీలిమిటేషన్‌పై రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన హైబ్రిడ్ విధానం ఏంటో ఇవాళ స్పష్టమైందని అది హైబ్రిడ్ కాదు క్రాస్ బ్రీడ్ అని సెటైర్ వేశా-రు. ఈ క్రాస్ బ్రీడ్ సిద్ధాంతం రాహుల్ గాంధీకి, సోనియా గాంధీకి అర్థమవుతుందో లేదో అని ఎద్దేవా చేశారు. బడే భాయ్‌కి భయపడే తెలంగాణను అవమానించిన తేజస్వి సూర్య వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటిదాకా కనీసం స్పందించలేదన్నారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో బీజేపీ, కాంగ్రెస్ పార్లమెంటులో కొట్లాడినట్లు నాటకాలు ఆడుతూ మహిళలకు తీరని ద్రోహం చేశాయని మహిళా బిల్లుకు నిజంగా చట్టబద్ధత కల్పించాలనుకుంటే దాన్ని డీలిమిటేషన్ ప్రక్రియతో ఎందుకు ముడిపెట్టారని ప్రశ్నించారు. బీజేపీకి పార్లమెంటులో 2/3 మెజార్టీ లేదని, 68 సీట్లు తక్కువ ఉన్నాయని ఆ పార్టీకి స్పష్టంగా తెలుసు. కేవలం రాజకీయాల కోసమే, ఎటువంటి చిత్తశుద్ధి లేకుండానే మహిళా బిల్లును తీసుకొచ్చారన్నారు. మహిళా రిజర్వేషన్లపై బీఆర్ఎస్ చిత్తశుద్ధి ఏనాడో నిరూపితమైందని కేసీఆర్ నాయకత్వంలో మొదటి తెలంగాణ శా-సనసభలోనే మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపిన ఘనత మా పార్టీదేనన్నారు.

# ఇది ప్రజాస్వామ్య విజయం..



**ఢిల్లీ :** శాశ్వతంగా అధికారంలో ఉండాలని బీజేపీ కుట్ర పన్నిందని.. ఆ కుట్రను ప్రతిపక్షాలు తిప్పికొట్టాయని వయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ అన్నారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంపై ఢిల్లీలో మీడియాతో ప్రియాంకాగాంధీ మాట్లాడారు. విపక్షాలన్నీ ఏకమైతే ప్రభుత్వానికి ఓటమి తప్పదని నిన్నటి ఘటనతో రుజువైందన్నారు. ప్రజాస్వామ్యం గెలిచిందని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో ఇతర బిల్లులు కలపకుండా.. 2023లో ఆమోదం పొందిన బిల్లునే తిరిగి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని కేంద్రం కుట్ర చేసిందని ఆరోపించారు. దేశం మారింది.. ప్రజలు అర్థం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయాలనుకుంటే మాత్రం పరిస్థితులు ఇలానే ఉంటాయని సూచించారు. తమిళనాడు, బెంగాల్ ఎన్నికలు జరుగుతున్న సమయంలో ప్రభుత్వం హడావిడిగా ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసిందన్నారు. సమావేశాల తర్వాత అజెండాను ప్రకటించదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును సాకుగా చూపించి డీలిమిటేషన్ బిల్లును ఆమోదించి స్వప్రయోజనాలను పొందాలని చూసిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీని మహిళా వ్యతిరేకులుగా చిత్రీకరించాలని బీజేపీ చూస్తోందని పేర్కొన్నారు. ఈనెల 16 నుంచి 18 వరకు మూడు రోజుల పాటు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను కేంద్రం ఏర్పాటు చేసింది. మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు నారీశక్తి వందన్ చట్టసవరణ, డీలిమిటేషన్ బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టింది. దాదాపు 22 గంటల పాటు చర్చ చేపట్టిన తర్వాత ఓటింగ్ నిర్వహించింది. అనుకూలంగా 298 మంది, వ్యతిరేకంగా 230 మంది ఓట్లు వేశారు. మూడింట రెండొంతుల మెజార్టీ లేకపోవడంతో బిల్లులు వీగిపోయినట్లుగా స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. దీంతో బిల్లులు వెనక్కి తీసుకుంటున్నట్లుగా కేంద్రం తెలిపింది.

# హైదరాబాద్ ఈవీ హబ్..



**ఢిల్లీ :** తెలంగాణ పారిశ్రామిక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా కీలక అడుగులు వేశారు. శనివారం కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి , సహాయ మంత్రి శ్రీనివాస వర్మలతో భేటీ అయిన ముఖ్యమంత్రి, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిష్టాత్మక ప్రతిపాదనలను వారి ముందుంచారు. ముఖ్యంగా బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ పరిశ్రమ స్థాపన ద్వారా ఉక్కు కొరత తీరడమే కాకుండా, పర్యావరణానికి ఎంతో మేలు చేకూరుతుందని ఆయన వివరించారు. 'తెలంగాణ రైజింగ్-2047' విజన్‌లో భాగంగా రూపొందించిన పారిశ్రామిక ప్రణాళికలను వివరిస్తూ, పాత వాహనాల స్క్రాప్‌తో ఉక్కును రీసైక్లింగ్ చేసే సరికొత్త పరిశ్రమను తెలంగాణలో నెలకొల్పాలని కేంద్ర మంత్రులను కోరారు. హైదరాబాద్ నగరాన్ని దేశ పారిశ్రామిక ఉత్పత్తికి గుండెకాయలా మార్చేందుకు ఉన్న అనుకూలతలను సీఎం ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. హైడ్రోజన్ టెక్నాలజీతో గ్రీన్ స్టీల్ క్లస్టర్, ఆటోమొబైల్ , రక్షణ రంగాలకు అవసరమైన ఉత్పత్తుల తయారీ పరిశ్రమలను ప్రోత్సహించాలని కోరారు. ప్రస్తుత కాలంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, ఈవీ బ్యాటరీల తయారీ కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడం అత్యవసం-మని ఆయన వివరించారు. దీనితో పాటు మెషిన్ టూల్స్ , రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక పరికరాల తయారీ కోసం ఒక ప్రత్యేక పార్క్‌ను కేటాయించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా 2034 నాటికి హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చడమే తమ ప్రభుత్వ ప్రధాన ఆశయమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధన కోసం పాత వాహనాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. అలాగే, భవిష్యత్ పరిశ్రమలకు అవ-సరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేసేందుకు జాతీయ స్థాయి నైపుణ్య శిక్షణ సంస్థలను హైదరాబాద్‌లో నెలకొల్పాలని కోరారు. ఈ కీలక భేటీలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు , కేంద్ర ప్రాజెక్టుల సమన్వయ ప్రత్యేక కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ కూడా పాల్గొన్నారు. సీఎం చేసిన వినూత్న ప్రతిపాదనలపై కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

# రాజేంద్రనగర్ ఆర్డీవోకు నెల రోజుల జైలు శిక్ష..



**గండిపేట,ఫ్లాష్ ఇండియా :** రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకటరెడ్డికి నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. శంషాబాద్ మండలం పెద్ద షాపూర్‌లోని 74 ఎకరాలకు కొన్ని సంవత్సరాలుగా ఆర్డీవో కార్యాలయంలో కేసు నడుస్తోంది. సదరు భూమి సీలింగ్ ల్యాండ్ అంటూ వివాదం ఉంది. అయితే యూసుఫుద్దీన్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన కోర్టు యూసుఫుద్దీన్ అనే వ్యక్తి భూమి అంటూ తెలిపింది. ఈ నేపథ్యంలో కోర్టు ఉత్తర్వులు అమలు చేయడం లేదని న్యాయస్థానం ఆర్డీవో వెంకటరెడ్డికి నెల రోజుల జైలు శిక్ష అదే విధంగా రూ. 2 వేల జరిమానా విధించింది. ఆప్పీల్‌కు వీలుగా తీర్పు అమలను 2వారాలు నిలిపేసింది. ఈ నేపథ్యంలో శనివారం ఆర్డీఓ వెంకట్ రెడ్డి తిరిగి న్యాయ-స్థానాన్ని ఆశ్రయించారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా
మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# మహిళా బిల్లు వైఫల్యానికి బీజేపీదే బాధ్యత

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బీజేపీ పన్నిన కుటిల రాజకీయాల వల్లే దేశంలోని మహిళా లోకానికి దక్కాల్సిన రిజర్వేషన్లు వెంటనే దక్కకుండా పోయాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ సహా దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు ఈ బిల్లుకు ఏకగ్రీవంగా మద్దతు పలికినప్పటికీ, డీలిమిటేషన్ పేరుతో కావాలనే చిక్కుముళ్లు తెచ్చిపెట్టి బిల్లు విఫలమయ్యేలా చేసింది బీజేపీ అని ధ్వజమెత్తారు. మహిళా సాధికారతపై బిజెపికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని నేటి పరిణామాలతో తేలిపోయిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ సీట్లతోనే మహిళా రిజర్వేషన్లను అమలు చేసి ఉంటే ఎటువంటి సమస్య వచ్చేది కాదని.. కానీ మహిళల రిజర్వేషన్ల అంశాన్ని ముడిపెట్టి దేశ మహిళల భుజాల మీద నుంచి దక్షిణాది రాష్ట్రాల గొంతు కోయాలని బీజేపీ చూసిందని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను, డీలిమిటేషన్ పర్యవసానాలను పట్టించుకోకుండా మొండిగా ముందుకు పోవడంతో ఒక చారిత్రక అవకాశం జారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ల పేరుతో బీజేపీ ఆడిన నాటకాన్ని దేశ ప్రజలు కళ్లారా చూశారని తెలిపారు. కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసం మహిళలను వాడుకుని, ఇప్పుడు వారిని వెన్నుపోటు పొడిచిన పార్టీగా బీజేపీ చరిత్రలో నిలిచిపోతుందని వెల్లడించారు. ఇప్పటికైనా తన నిజాయితీని నిరూపించుకోవాలంటే డీలిమిటేషన్ నిబంధన లేకుండా కేవలం మహిళా రిజర్వేషన్ల కోసమే ఒక కొత్త బిల్లును ప్రవేశపెట్టి, రానున్న ఎన్నికల నుంచే దాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.



# మీ సూచనలు భేష్...
## సీఎం రేవంత్ రెడ్డికి ప్రియాంక గాంధీ అభినందనలు

**ఢిల్లీ :** నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రతిపాదనల విషయంలో బీజేపీ విధానంలోని లోపాలను ప్రజల ముందుంచడంతో పాటు ప్రత్యామ్నాయ సూచనలు చేసి దక్షిణాది రాష్ట్రాల ఐక్యతకు కృషి చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ నుంచి ప్రశంసలు అందాయి. ఢిల్లీలో ప్రియాంక గాంధీని శనివారం ఉదయం రేవంత్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా దక్షిణ భారత దేశంతో పాటు ఈశాన్య రాష్ట్రాలు, చిన్న రాష్ట్రాలను బలహీనపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రజాస్వామ్య విరుద్ధ రాజ్యాంగ సవరణను అడ్డుకోవడం.... దేశ భవిష్యత్తును కాపాడేందుకు ప్రతిపక్ష శక్తులను ఏకతాటిపైకి తీసుకురావడంలో విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు మద్దతుగా నిలిచినందుకు తెలంగాణ ప్రజల తరపున ప్రియాంక గాంధీకి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే ఏకగ్రీవంగా ఆమోదం పొందిన మహిళా బిల్లుతో సంబంధం లేకుండా, మహిళా సాధికారత పేరుతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, అనవసరమైన డీలిమిటేషన్ అజెండాను ముందుకు తీసుకువచ్చారని ఈ సందర్భంగా ప్రియాంక గాంధీ సీఎంతో అన్నారు.

# దక్షిణాదికి కాంగ్రెస్ చారిత్రక ద్రోహం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లును విపక్షాలు అడ్డుకోవడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, ఇండి కూటమి దేశ దక్షిణాది రాష్ట్రాలకు చారిత్రక ద్రోహం చేశా-యని ఆయన ధ్వజమెత్తారు. వెలుపల "దక్షిణాది గౌరవం" అంటూ నినదించే విపక్షాలు, పార్లమెంటులో మాత్రం ఆ ప్రాంత ప్రయోజనాలను కాపాడే బిల్లును చంపేశాయని ఆయన విమర్శించారు. ఈ మేరకు శనివారం (ఏప్రిల్ 18, 2026) ఆయన 'X' వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు.



**దక్షిణాది రాష్ట్రాలకు పొంచి ఉన్న ముప్పు**

2026 తర్వాత జరగబోయే నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలు తమ రాజకీయ ప్రాధాన్యతను కోల్పోయే ప్రమాదం ఉందని బండి సంజయ్ హెచ్చరించారు. జనాభాను నియంత్రించి, విద్య, అభివృద్ధిపై పెట్టుబడి పెట్టిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల గొంతు నొక్కేలా సీట్ల సర్దుబాటు జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ముప్పు నుండి దక్షిణాదిని కాపాడేందుకు ఎన్డీయే ప్రభుత్వం ఒక రక్షణ కవచంలా 131వ సవ-రణ బిల్లును తెచ్చిందని, కానీ విపక్షాలు దానిని అడ్డుకుని రాజకీయ స్వార్థాన్ని ప్రదర్శించాయని మండిపడ్డారు.

**విపక్షాల ద్వంద్వ నీతిని ఎండగట్టిన మంత్రి..**

కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్ లో స్పష్టమైన హామీ ఇచ్చారని, దక్షిణాది సీట్లను 50 శాతం పెంచేందుకు కూడా సిద్ధమని ప్రకటించినా విపక్షాలు మౌనంగా ఉ ండిపోయాయని బండి సంజయ్ గుర్తు చేశారు. మహిళలకు న్యాయం చేసే, భవిష్యత్ తరాలకు సరైన ప్రాతినిధ్యం కల్పించే ఈ చారిత్రక సంస్కరణను అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ తన అసలు స్వరూపాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. ప్రధాని మోదీ ప్రతి ప్రాంతాన్ని రక్షించేందుకు కృషి చేస్తుంటే, విపక్షాలు కేవలం అధికారం కోసమే పాకులాడుతున్నాయని, ఈ ద్రోహాన్ని దేశ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని ఆయన పేర్కొన్నారు.

# రాంచందర్ రావు హౌస్ అరెస్ట్



**సికింద్రాబాద్,ఫ్లాష్ ఇండియా :** మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావును శనివారం పోలీసులు గృహనిర్బంధం చేశారు. సీఎం నివాసాన్ని ముట్టడించేందుకు వెళ్లకుండా ఆయన నివాసం వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. పార్లమెంట్‌లో మహిళల గొంతు నొక్కారని, రాష్ట్రంలో తమ నిరసనలను అడ్డుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తున్నారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తోందని ఆయన అన్నారు. 2023లో ఈ బిల్లుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్, ఇప్పుడు వ్యతిరేకంగా ఓటు వేయడం వారి నిజ స్వరూపాన్ని బయటపెడుతుందని విమర్శించారు. మహిళల సాధికారతపై మాటల్లో మద్దతు ఇచ్చి, ఆచర-ణలో అడ్డుకోవడం కాంగ్రెస్ విధానమని ఆయన పేర్కొన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే సామాన్య మహిళలకు రాజకీయాల్లో అవకాశాలు పెరుగుతాయని, అయితే కుటుంబాధిపత్య రాజకీయాలు చేసే కాంగ్రెస్‌కు ఇది ఇష్టం లేదని రాంచందర్ రావు ఆరోపించారు. గత 30 ఏళ్లుగా మహిళా బిల్లును వాయిదా వేస్తూ వస్తోందని కూడా విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమాన్ని అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను హరించిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపిస్తూ, మహిళల హక్కులను అడ్డుకున్న కాంగ్రెస్‌ను ప్రజలు క్షమించరని అన్నారు.

# లోక్‌సభ నిరవధిక వాయిదా



**ఢిల్లీ :** భారత పార్లమెంట్‌లో జనవరి 28న ప్రారంభమైన 2026-27 బడ్జెట్ సమావేశాలు శనివారంతో ముగిశాయి. ఈ సమావేశాలు భారత రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రూ. 53.47 లక్షల కోట్ల వ్యయంతో కూడిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాలకు ఇందులో పెద్దపీట వేశారు. సమావేశాల చివరి దశలో నియోజకవర్గాల పునర్విభజన , మహిళా రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వం, విపక్షాల మధ్య జరిగిన పోరు ఈ సెషన్‌కు కేంద్రబిందువుగా నిలిచింది. ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులు ఆమోదం పొందాయి. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, 2026 ద్వారా అమరావతి రాజధానిగా మరింత స్పష్టత లభించగా, వ్యాపార లావాదేవీల సరళీకరణ కోసం జన్ విశ్వాస్ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. అయితే 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై జరిగిన చర్చల సమయంలో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దక్షిణాది రాష్ట్రాల సీట్ల సంఖ్య తగ్గుతుందనే ఆందోళనతో విపక్షాలు ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకించాయి. దీంతో సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. ఈ బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు వచ్చాయి. దీంతో డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులను కేంద్రం వెనక్కి తీసుకుంది. మూడో రోజు శనివారం స్పీకర్ ఓం బిర్లా సభను నిరవధిక వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడంతో మూడో రోజు ఎటువంటి చర్చలు లేకుండా సభ వాయిదా పడింది. దీంతో సుమారు మూడు నెలల పాటు సాగిన ఈ సుదీర్ఘ బడ్జెట్ సమావేశాలు అధికారికంగా ముగిశాయి.

# రేవంత్ సర్కార్‌కు రైతుల పాపం తాకుతది..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల ముందు సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డి సర్కార్, ఇప్పుడు పగటి వేషగాడిలా వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు. ఇవాళ ఆయన హనుమకొండ లో మీడియాతో మాట్లాడుతూ.. ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయిందని ధ్వజమెత్తారు. బంగారం లాంటి మంచిగున్న మేడిగడ్డ ప్రాజెక్టు ను రేవంత్ సర్కార్ కావాలనే బద్నాం చేసిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు చిన్నపాటి మరమ్మతులు అవసరమైతే, వాటిని చేయకుండా కాలయాపన చేస్తూ ప్రాజెక్టును పనికిరాకుండా చేస్తున్నారని విమర్శించారు.

**అన్నదాతలను గోస పెడుతుండ్రుగా..**

అదేవిధంగా మేడిగడ్డ పునర్నిర్మాణానికి ఎల్ అండ్ టీ సంస్థ ముందుకు వచ్చినప్పటికీ.. ఆ విషయం బయటకు చెప్పకుండా ప్రాజెక్టు మ-రమ్మతులు చేపట్టకపోవడం వల్లే నేడు రైతుల పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి లో నీళ్లు ఉన్నా.. కాల్వలకు విడుదల చేయలేక రైతులను గోసపెడుతున్నారని ఫైర్ అయ్యారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందని, ఈ రైతుల పాపం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఖచ్చితంగా తగులుతుందని ఆయన హెచ్చరించారు. ఎన్నికల హామీలను

గాలికొదిలేసి కేవలం రాజకీయ కక్ష సాధింపులకే ప్రాధాన్యత ఇస్తున్న రేవంత్ రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉ న్నాయని ఎర్రబెల్లి దయాకర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఏప్రిల్ 20 నుంచి 'సంక్షేమ వారోత్సవాలు'



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రవ్యాప్తంగా 99 డేస్ ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 20 నుంచి 26 వరకు సంక్షేమ వారోత్సవాలు నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కీలక ఆదేశాలు జారీ చేశారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపా-యాలను మెరుగుపరచడం, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడం, ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ వారోత్సవాల ప్రధాన ఉద్దేశ్యం అని స్పష్టం చేశారు.

**రోజువారీ కార్యక్రమాల షెడ్యూల్:**

ఈ వారోత్సవాలను విజయవంతం చేయడానికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ ప్రతి రోజు నిర్వహించాల్సిన కార్యక్రమాలను ఖరారు చేశారు

ఏప్రిల్ 20 (శుభ్రత): అన్ని సంక్షేమ విద్యా సంస్థల్లో కిచెన్, పరిసరాలను శుభ్రపరిచే 'క్లీన్‌లీనెస్ డ్రైవ్'. అధికారులు స్వయంగా సందర్శించి పరిశుభ్రతను పర్యవేక్షించాలి.

ఏప్రిల్ 21 (టాలెంట్ ఫెస్ట్): విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకు క్విజ్, డిబేట్, డ్రాయింగ్ వంటి పోటీలు నిర్వహించడం.

ఏప్రిల్ 22 (మౌలిక సదుపాయాలు): హాస్టళ్లు, గురుకులాల్లో అవసరమైన చిన్న చిన్న మరమ్మతులను గుర్తించి, వేసవి సెలవుల్లో వాటిని పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయడం.

ఏప్రిల్ 23 (తల్లిదండ్రుల సమావేశం): పేరెంట్-టీచర్ మీటింగ్ నిర్వహించడం, ప్రతిభావంతులైన విద్యార్థులను సన్మానించడం.

ఏప్రిల్ 24 (నైపుణ్యాభివృద్ధి): యువతకు ఉ పాధి అవకాశాలను పెంచేలా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం.

ఏప్రిల్ 25 (సమ్మర్ క్యాంపులు): విద్యార్థుల కోసం క్రీడలు, కళలు, సంగీతం, డిజిటల్ అక్షరాస్యతతో కూడిన వేసవి శిబిరాలు.

ఏప్రిల్ 26 (బడి బాట): రాష్ట్రవ్యాప్తంగా అన్ని హాస్టళ్లు, గురుకులాల్లో 'బడి బాట' కార్యక్రమం నిర్వహించడం.

**కలెక్టర్లకు కీలక ఆదేశాలు:**

కార్యక్రమాల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతిరోజూ జరిగిన పనులపై ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాలని సీఎస్ ఆదేశించారు. ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, సీఐపీఆర్ ఛాందసి ప్రియాంక తదితర అధికారులు పాల్గొన్నారు.

# విపక్షం తప్పు చేసింది..



**ఢిల్లీ :** పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోయింది. మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు డీలిమిటేషన్ బిల్లు ప్రవేశపెట్టడంతో విపక్షం అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో బిల్లు వీగిపోయింది. ఈ పరిణామాల నేపథ్యంలో శనివారం ఉదయం ప్రధాని మోడీ కేంద్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. తాజా పరిణామాలపై మంత్రులతో చర్చించారు. ఈ సందర్భంగా మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్షం తప్పు చేసిందని.. పర్యవసానాలు అనుభవిస్తారని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్నందుకు మహిళలకు ప్రతిపక్ష సభ్యులే సమాధానం చెప్పుకోవాలన్నారు. పార్లమెంటులో మహిళలకు 33 శాతం సీట్లు రిజర్వ్ చేసే రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడానికి మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం ఉంటుంది. కానీ అందుకు తగ్గట్టుగా ఓట్లు రాలేదు. ఓటింగ్ నిర్వహించగా బిల్లుకు కేవలం 298 మంది మాత్రమే ఆమోదం తెల్పగా.. 230 మంది ఎంపీలు వ్యతిరేకించారు. దీంతో మూడింట రెండొంతుల మెజార్టీ రాకపోవడంతో బిల్లు వీగిపోయినట్లుగా స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. దీంతో బిల్లులను వెనక్కి తీసుకుంటున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఇదిలా ఉంటే ఇదే అంశంపై ప్రియాంకాగాంధీ మీడియాతో మాట్లాడుతూ.. శాశ్వతంగా అధికారంలో ఉండాలని బీజేపీ కుట్ర పన్నిందని.. దాన్ని విపక్షం తిప్పికొట్టిందని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం గెలిచిందని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో ఇతర బిల్లులు కలపకుండా.. 2023లో ఆమోదం పొందిన బిల్లునే తిరిగి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని కేంద్రం కుట్ర చేసిందని ఆరోపించారు. దేశం మారింది.. ప్రజలు అర్థం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయాలనుకుంటే మాత్రం పరిస్థితులు ఇలానే ఉంటాయని సూచించారు. తమిళనాడు, బెంగాల్ ఎన్నికలు జరుగుతున్న సమయంలో ప్రభుత్వం హడావిడిగా ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసిందన్నారు. సమావేశాల తర్వాత అజెండాను ప్రకటించదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును సాకుగా చూపించి డీలిమిటేషన్ బిల్లును ఆమోదించి స్వప్రయోజనాలను పొందాలని చూసిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీని మహిళా వ్యతిరేకులుగా చిత్రీకరించాలని బీజేపీ చూస్తోందని ప్రియాంకాగాంధీ పేర్కొన్నారు.

# ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలి



**మంథని,ఫ్లాష్ ఇండియా :** రైతు భరోసా విడుదల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐటి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శనివారం మంథని పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంథని, రామగిరి, కమాన్పూర్, ముత్తారం. పాలకుర్తి మండలాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఐటి మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. సోమవారం కాటారంలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి రైతు భరోసా విడుదల కార్యక్రమం ఏర్పాట్లపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఈ సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనమల రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వ-రరావుతో, ఐటి మంత్రి శ్రీధర్ బాబు, మంత్రివర్గ సహచరులు రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొననున్నారు.

**ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు హాజ-రవ్వాలి..**

ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... రైతు భరోసా పథకం రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. సోమవారం జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు హాజరయ్యేలా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి శ్రీధర్ బాబు దిశానిర్దేశం చేశారు. అలాగే కార్యక్రమం సజావుగా జరిగేలా బాధ్యతలు కేటాయించి, ప్రతి ఒక్కరు తమ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో మంథని, రామగిరి, కమాన్పూర్, ముత్తారం పాలకుర్తి మండలాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీజేపీ నియంతృత్వానికి చెక్ పెట్టినాం



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అశాస్త్రీయంగా, చట్టవిరుద్ధంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోవడం ప్రజాస్వామ్య విజయానికి నిదర్శనమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీ భవన్‌తో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. తాజా పరిణామంతో బీజేపీ నియంతృత్వ పోకడలకు, రాజకీయ ఎత్తుగడలకు అడ్డుకట్ట పడిందని స్పష్టం చేశారు.

**డీలిమిటేషన్ కుట్ర భగ్నం**

మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డం పెట్టుకుని, అక్రమంగా డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) బిల్లును రుద్దాలని చూసిన బీజేపీ కుట్రను ప్రతిపక్షాలతో కలిసి కాంగ్రెస్ భగ్నం చేసిందని అన్నారు. ఈ బిల్లు ద్వారా ఉత్తర భారతానికి అధిక సీట్లు కేటాయించి, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయాలని చూసిన రాజకీయ ఎత్తుగడను కాంగ్రెస్ విజయవంతంగా అడ్డుకుందని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు.

**మహిళా బిల్లుపై బీజేపీ ద్వంద్వ నీతి**

మహిళా రిజర్వేషన్ల విషయంలో బీజేపీకి చిత్తశు ద్ధి లేదని టీపీసీసీ చీఫ్ ధ్వజమెత్తారు. 2023లో బిల్లు ఆమోదం పొందినా, 2024 ఎన్నికల్లో ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. 2029 లేదా 2034 అంటూ మహిళలను మోసం చేస్తోందని విమర్శించారు. 2010లోనే మన్మోహన్ సింగ్ ప్రభుత్వం రాజ్యసభలో మహిళా బిల్లును పాస్ చేయించిందని, రాజీవ్ గాంధీ ఆలోచనలతో పీవీ నరసింహారావు ప్రభుత్వం స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించిందని గుర్తు చేశారు. 46 ఏళ్ల చరిత్ర గల బీజేపీకి ఇప్పటి వరకు ఒక్క మహిళా అధ్యక్షురాలు కూడా లేకపోవడం వారి వివక్షకు అద్దం పడుతోందని ఎద్దేవా చేశారు. తొలి మహిళా ప్రధానిని, ముఖ్యమంత్రిని, రాష్ట్రపతిని అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, ఆర్టికల్ 370 మీద ఉన్న శ్రద్ధ బీజేపీకి మహిళా బిల్లు మీద ఎందుకు లేదని ఆయన ప్రశ్నించారు.


**కిషన్ రెడ్డి ఒక్క బీసీ నాయకుడినైనా తయారు చేశారా..?**

బీజేపీ ఒక మనువాద, బీసీ వ్యతిరేక పార్టీ అని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. కిషన్ రెడ్డి తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఒక్క బీసీ లీడర్‌నైనా తయారు చేశారా? అని సవాల్ విసిరారు. తెలంగాణకు బీజేపీ చేసిందేమీ లేదని, రాష్ట్రంపై చూపుతున్న వివక్షకు శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**దక్షిణాదిపై వివక్ష.. ప్రతిపక్షాల ఐక్యత**

తెలంగాణ ఏర్పాటును పాకిస్తాన్ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై బీజేపీ నేతల మౌనాన్ని మహేష్ కుమార్ గౌడ్ దుయ్యబట్టారు. దేశ నిర్మాణంలో దక్షిణాది పాత్ర గణనీయమని, దానిని తక్కువ చేసే ప్రయత్నాలను సహించేది లేదని హెచ్చరించారు. మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో ప్రతిపక్షాలన్నీ ఏకమై కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక నిర్ణయాలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

# తప్పిపోయిన బాలుడు సురక్షితం..



**తిరుమల,ఫ్లాష్ ఇండియా :** తమిళనాడు రాష్ట్రం చంగల్ పట్టు ప్రాంతానికి చెందిన 12 సంవత్సరాల ఆదర్శ్ అనే బాలుడు అలిపిరి 2500వ మెట్టు వద్ద తప్పిపోయిన విషయం టీటీడీ విజిలెన్స్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు తెలిసింది. వెంటనే స్పందించిన ఏవీఎస్వోలు సిబ్బందిని అప్రమత్తం చేసి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో తిరుమలలోని పిఎసి-2 ప్రాంతంలో బాలుడు కనిపించినట్లు విజిలెన్స్ & సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. అనంతరం ఆదర్శ్‌ను సురక్షితంగా లేపాక్షి సర్కిల్‌లోని విజిలెన్స్ కార్యాలయానికి తీసుకువచ్చి ఎవీఎస్వో వెంకట శివ కుమార్, కృష్ణయ్య సమక్షంలో అతని బంధువులకు అప్పగించారు. ఈ సందర్భంగా టీటీడీ విజిలెన్స్ సిబ్బందికి బాలుడి బంధువులు కృతజ్ఞతలు తెలియజే శారు. తప్పిపోయిన బాలుడిని త్వరితగతిన గుర్తించి సురక్షితంగా అప్పగించిన విజిలెన్స్ సిబ్బందిని టీటీడీ ఉన్నతాధికారులు అభినందించారు.

# తెలుగు రాష్ట్రాలకు వరమా? శాపమా?



ఏఐ జనరేటెడ్ ఫోటో

దేశ వ్యాప్తంగా నియోజకవర్గాల సంఖ్యను దాదాపు 50 శాతం పెంచాలని కేంద్రం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలు 816కి చేరనున్నాయి. అదే విధంగా దేశ వ్యాప్తంగా ఉన్న అసెంబ్లీ స్థానాల సంఖ్య 4,123 నుంచి 6,185కి పెరగనున్నాయి. అయితే నియోజకవర్గాల పునర్వ్యభిజన బిల్లుతో తెలుగు రాష్ట్రాలకు నష్టం జరుగుతుందా? మేలు జరుగుతుందా? అనే ప్రశ్న కీలకంగా మారింది. 2014లో ఉమ్మడిగా ఉన్న ఏపీ.. రెండు రాష్ట్రాలుగా విడిపోయింది. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాల్ని పెంచుతామని విభజన చట్టంలో స్పష్టం చేశారు. తాజాగా తెరమీదకు వచ్చిన నియోజకవర్గాల పునర్వ్యభిజన చట్టం కారణంగా తెలుగు రాష్ట్రాలకు మేలు జరుగుతుందా? విభజన చట్టాన్ని యథాతథంగా అమలు చేస్తే లాభం జరుగుతుందా? అన్నది సందేహంగా మారింది. అయితే.. నియోజకవర్గాల పెంపు యాభై శాతం గుండుగుత్తుగా అని స్పష్టత వచ్చేసిన నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన అసెంబ్లీ.. లోక్ సభ స్థానాలకు సంబంధించి పూర్తి క్లారిటీ వచ్చేసిందని చెప్పాలి. ఉమ్మడి ఏపీలో 2014 వరకు 294 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. 42 లోక్ సభ స్థానాలు ఉన్నాయి. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి 175 స్థానాలు.. తెలంగాణకు 119 స్థానాలు వెళ్లాయి. అదే సమయంలో లోక్ సభ స్థానాల అంశాన్నే తీసుకుంటే.. ఏపీకి 25 స్థానాలు.. తెలంగాణకు 17 స్థానాలు కేటాయించారు. విభజన చట్టంలో రెండు తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంచుతామని చెప్పారు. ఈ లెక్కన ఏపీ అసెంబ్లీలో ఉన్న 175 స్థానాలకు 225 స్థానాలు పెరగాలి. అదే ఇప్పుడు కేంద్రం తెర మీదకు తీసుకొచ్చిన పునర్విభజన చట్టంలో చెప్పినట్లుగా 50 శాతం స్థానాల్ని పెంచేస్తే ఏపీలో అసెంబ్లీ స్థానాలు 263కు చేరుకుంటాయి. అంటే.. విభజన చట్టంలో పేర్కొన్న దాని కంటే తాజా డీలిమిటేషన్ బిల్లుతోనే ఎక్కువగా అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయి. అదే సమయంలో తెలంగాణ విషయానికి వస్తే.. ప్రస్తుతం 119 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. 50 శాతం పెంపుతో ఇది కాస్తా 179కు పెరుగుతంది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో ఏపీ రాష్ట్ర వాటా 4.08 శాతం. ఆ నిష్పత్తి ప్రకారం ఏపీకి వచ్చే లోక్ సభ స్థానాలు 33 మాత్రమే. ఇది ఉత్తరాదితో పోలిస్తే ఏపీకి నష్టం. అదే సమయంలో జనాభా లెక్కల ప్రకారం కాకుండా.. 50 శాతం సీట్ల పెంపు నిర్ణయాన్ని తీసుకుంటే.. ఏపీలో లోక్ సభ సీట్లు ప్రస్తుతం ఉన్న 25 సీట్లు కాస్తా 37–38 అవుతాయి. తెలంగాణ విషయానికి వస్తే ప్రస్తుతం లోక్ సభ స్థానాలు 17 ఉన్నాయి. జనాభా లెక్కలు కాకుండా.. 50 శాతం గుండుగుత్తుగా పెంచేస్తే తెలంగాణలో లోక్ సభ స్థానాల సంఖ్య 17 కాస్తా 25–26 మధ్యలో పెరిగే వీలుంది. మొత్తంగా చూస్తే.. విభజన చట్టాన్ని అనుసరించే కన్నా.. 50 శాతం పెంచే బిల్లుతోనే తెలుగురాష్ట్రాలకు మేలు చేకూరుస్తుందని చెప్పక తప్పదు. ఇంతవరకు బాగానే ఉన్నా.. తెలుగు రాష్ట్రాల్లో పెరిగే సీట్లు ఎక్కడ పెరుగుతాయి..? తగ్గే సీట్లు ఎక్కడ తగ్గుతాయనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం.. జనాభా ఎక్కువగా ఉన్న పెద్ద నగరాల్లో సీట్లు పెరిగి.. గ్రామీణ ప్రాంతాల్లో తగ్గొచ్చనేది అంచనా. అలా జరిగితే.. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి చుట్టుపక్కలే ఎక్కువ సీట్లు పెరిగే అవకాశం ఉంది. ఎందుకంటే తెలంగాణ జనాభా 3.60 కోట్లు కాగా.. జీహెచ్ఎంసీ జనాభానే కోటి పైగా ఉంది. కాబట్టి ఇక్కడ సీట్లు పెంచక తప్పదు. గతంలో పునర్విభజన జరిగినప్పుడు కూడా హైదరాబాద్‌లో సీట్లు పెరిగిన సంగతిని సీనియర్లు గుర్తుచేసుకుంటున్నారు. ఇక ఏపీ విషయానికొస్తే అక్కడ హైదరాబాద్ లాంటి పెద్ద నగరాల్లేవు. కాకపోతే పాతిక లక్షల జనాభా ఉన్న విశాఖ, 16 లక్షల జనాభా ఉన్న విజయవాడే పెద్ద నగరాలుగా ఉన్నాయి. ఆ నగరాల్లో సీట్ల పెంపు ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చనే చర్చ జరుగుతోంది. ఏతావాతా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ నగర ప్రాంతాల్లో సీట్లు పెరిగి.. గ్రామీణ ప్రాంతాల్లో సీట్లు తగ్గుతాయనేది ప్రముఖంగా వినిపిస్తున్న మాట. అలా జరిగితే అర్బన్ ప్రాంతాల్లో పట్టున్న పార్టీలకు, నేతలకు అడ్వాంటేజ్ ఉంటుందనే వాదన వినిపిస్తోంది. తద్వారా గ్రామీణ ఓటర్ల కంటే అర్బన్ ఓటర్లను ఆకట్టుకోవటానికి పార్టీలు, నేతలు ఎక్కువ ప్రయత్నాలు చేస్తారనడంలో సందేహం అక్కర్లేదనే అభిప్రాయాలు వస్తున్నాయి. ఈ పరిణామాల్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో పార్టీలన్నీ తమ బలాబలాలు, ట్రాక్ రికార్డ్, ఓట్ల శాతం, పట్టున్న ప్రాంతాల లెక్కలు తీసే పనిలో పడ్డాయి. దాన్ని బట్టి భవిష్యత్ రాజకీయ వ్యూహం ఖరారు చేసుకునే పనిలో పడొచ్చని నేతలు భావిస్తున్నారు. డీలిమిటేషన్‌కు ఓ రకమైన కసరత్తు చేయాల్సి ఉండగా.. మహిళా రిజర్వేషన్ సీట్ల విషయంలో మరో రకమైన కసరత్తు చేయక తప్పదని పార్టీలు లెక్కలేసుకుంటున్నాయి. మహిళా రిజర్వేషన్లు ఎక్కడ ఖరారవుతాయో తెలియదు కాబట్టి.. ముందుగానే అన్ని నియోజకవర్గాల్లో మహిళా నేతల్ని రెడీ చేసుకోవడం తొలి అడుగు. ఆ తర్వాత ఇప్పటికే పురుష అభ్యర్థులు పాతుకుపోయిన చోట సీట్లు మహిళలకు రిజర్వ్ అయితే.. అప్పుడు పాతకాపుల్ని కూడా మహిళలకు మద్దతిచ్చేలా సమన్వయం చేసుకోవడం రెండో అడుగు. ఆ తర్వాత మహిళలు పోటీచేసే నియోజకవర్గాల్లో సొంత పార్టీకి అనుకూలత ఉండేలా చూసుకుని.. ప్రత్యర్థులు బలపడకుండా చూసుకోవడం మూడో అడుగు. ఈ మూడు అడుగుల్లో ఎక్కడ తేడా వచ్చినా.. అసలుకే ఎసరు వస్తుందని అన్ని పార్టీలూ టెన్షన్ పడుతున్నాయి. ఇప్పటికే ఓ మేరకైనా మహిళా నేతల్ని ఎంకరేజ్ చేస్తున్న పార్టీలు.. కొంత ధీమాగా ఉన్నా.. మహిళలకు పెద్దగా ప్రాతినిధ్యం ఇవ్వని, చెప్పుకోదగ్గ మహిళా నేతల్లేని పార్టీలకు గుబులు పట్టుకుంది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతిచ్చినంత తేలికగా.. వారికి కేటాయించిన సీట్లు గెలవగలమా.. లేదా అని నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. కొన్ని పార్టీలకు మహిళల్లో సహజ అనుకూలత ఉంది. మరికొన్ని పార్టీలు మహిళలకు చేసిన పనుల కారణంగా ఆదరణ ఉంది. ఇంకొన్ని పార్టీలకు మాత్రం స్వతహాగా మహిళల్లో అనుకూలత లేదు. కొన్నింటికైతే తమ తప్పు లేకుండానే ప్రత్యర్థుల చాతుర్యం కారణంగా మహిళా వ్యతిరేకులనే ముద్ర పడిపోయింది. ఇప్పటికిప్పుడు ఆ ముద్ర చెరిపేసుకోవడం కుదురుతుందా అనేది కొత్త టెన్షన్. ప్రస్తుతం మహిళా రిజర్వేషన్లు అమలు కాకుండానే.. ఎన్నికల్లో గెలుపోటములకు మహిళా ఓట్లే కీలకంగా మారుతున్నాయి. ఇటీవలే జరిగిన బీహార్ ఎన్నికల్లో నారీశక్తి ఘనంగా పనిచేసింది. ఇప్పుడే ఇలా ఉంటే.. ఇక మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాక పరిస్థితి ఇంకా మారుతుందని పార్టీలు అంచనా వేసన్నాయి. ఇకపై కచ్చితంగా మహిళల్ని దృష్టిలో పెట్టుకుని మ్యానిఫెస్టో, విధానాలు, రాజకీయ దృక్పథం ఉండక తప్పని స్థితి వస్తుందని అనుకుంటున్నాయి. అలాగే మహిళా రిజర్వేషన్ కారణంగా కొన్ని సీట్లలో కొందరు నేతల రాజకీయం గల్లంతు కానుంది. నేతల కుటుంబాల్లో మహిళలు రాజకీయాలకు సిద్ధంగా ఉంటే.. వారి స్థానంలో వీరిని బరిలో దించి తృప్తి పడొచ్చు. కానీ అలాంటి అవకాశం లేని నేతలు మాత్రం పూర్తిగా ఆశలు వదులుకోక తప్పదని పార్టీలు ముందే చెప్పేస్తున్నాయి. ఇక్కడ మొహమాటాలకు, మరే సమీకరణాలకూ తావు లేదని కుండబద్దలు కొడుతున్నాయి. పైగా మిగతా నియోజకవర్గాల్లో చేసినట్టు.. మహిళలకు కేటాయించిన సీట్లలో అతి తెలివి చూపిస్తే.. ఆ ప్రభావం మిగతా సీట్లన్నింటిపైనా పడి.. మహిళలంతా గంపగుత్తగా రివర్స్ అయితే పుట్టి మునుగుతుందని నేతలు భయపడుతున్నారు. అలా చూసుకుంటే.. ఈసారి మహిళా రిజర్వేషన్లు అమలైతే.. తెలుగు రాష్ట్రాల్లో చట్టసభలు కొత్త రూపు సంతరించుకుంటాయనడంలో సందేహం లేదు. ఇప్పటికే కొందరు మహిళా నేతలు చట్టసభల్లో ఉన్నా.. రిజర్వేషన్ల తర్వాత కనిపించే ముఖచిత్రం పూర్తి భిన్నంగా ఉంటుందనే అభిప్రాయాలు వస్తున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ప్రక్రియ వల్ల తెలంగాణ రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలు ఉండగా.. కొత్త లెక్కల ప్రకారం ఇవి 26 లేదా 27కు పెరిగే అవకాశముంది. అసెంబ్లీ స్థానాలు ప్రస్తుతం 119 ఉండగా.. అదనంగా 60 సీట్లతో 179కి చేరే అవకాశం ఉంది. 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుంటే.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జనాభా పరంగా దేశంలోనే 17వ స్థానంలో ఉంది. ఫలితంగా గ్రేటర్ హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోనే అదనంగా 3 నుంచి 4 కొత్త లోక్‌సభ స్థానాలు ఏర్పడనున్నాయి. దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గంగా ఉన్న మల్కాజిగిరితో పాటు సికింద్రాబాద్, హైదరాబాద్, భువనగిరి స్థానాలను విభజించి కొత్త నియోజకవర్గాలను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలను విభజించి అదనంగా మరో రెండు స్థానాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతమున్న మెదక్, జహీరాబాద్‌లకు తోడు మరొక కొత్త స్థానం రానుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ విభజన ద్వారా అదనంగా ఒక స్థానం ఏర్పడనుంది. ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో ఒకటి లేదా రెండు కొత్త స్థానాలు వచ్చే సూచనలున్నాయి. ప్రస్తుతం తెలంగాణ నుంచి లోక్‌సభలో ఇద్దరు మహిళలు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే 33 శాతం రిజర్వేషన్లు అమల్లోకి వస్తే.. 2029 ఎన్నికల నాటికి ఈ సంఖ్య కనీసం 9కి చేరనుంది. గత ఎన్నికల్లో ప్రధాన పార్టీలు మహిళలకు తక్కువ టికెట్లు కేటాయించినప్పటికీ.. భవిష్యత్తులో ప్రతి పార్టీ కచ్చితంగా 9 మంది మహిళా అభ్యర్థులను బరిలోకి దించాల్సి ఉంటుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఖమ్మం, కరీంనగర్ వంటి జిల్లాల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఈ మార్పులు మహిళల గొంతు పార్లమెంటులో మరింత బలంగా వినిపించడానికి దోహదపడతాయని అంటున్నారు. ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 179 అవుతాయని చెప్తున్నారు. ఆ లెక్కన 50 శాతం పెరిగినా.. జనాభా ప్రాతిపాదికన అసెంబ్లీ నియోజకవర్గాలు పునర్విభజిస్తే జిల్లాలోని జనాభాను అనుసరించి పునర్విభజన జరుగుతుంది. ఈ లెక్కన ఇప్పటికే పది అసెంబ్లీ స్థానాలు ఉన్న ఉమ్మడి జిల్లాలో మరో ఐదు పెరగవు. సరపడా జనాభా ఉంటేనే పెంపు ఉంటుంది. లేకపోతే ఉండదు. ఇక మహిళలు 33 శాతం రిజర్వేషన్ బిల్లును ఆమోదించనున్నారు. దీంతో పెరిగే స్థానాల్లో వచ్చే ఎన్నికల్లో 33 శాతం మహిళలకు రిజర్వ్ అవుతాయి. జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వ్ నియోజకవర్గాల్లో మార్పులు ఉండొచ్చు. ప్రస్తుతం ఎస్సీ ఉన్న నియోజకవర్గాల్లో పునర్విభజన జరిగి కొత్త నియోజకవర్గాలు ఏర్పడితే ప్రస్తుతం ఉన్న నియోజకవర్గంలో రిజర్వేషన్ మారే అవకాశాలున్నాయి. దీంతో అసెంబ్లీ స్థానాల పెంపు ఎలా ఉంటుందన్న విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. నియోజకవర్గాల పునర్విభజనలో అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దుల ఆధారంగా లోక్‌సభ స్థానాలను పునర్విభజించాలన్న నిబంధన పెట్టారు. ఈ లెక్కన ముందు అసెంబ్లీ నియోజకవర్గాలను ఏర్పాటు చేస్తారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా చేస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 27,41,239 మంది జనాభా ఉన్నారు. ప్రాథమికంగా అందుతున్న సమాచారం, జరుగుతున్న ప్రచారం మేరకు ప్రతి 2లక్షల జనాభాకు ఒక సీటు పెరిగే అవకాశం ఉంది. ఇక లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26 లేదా 27 అయ్యే అవకాశాలున్నాయి. జనాభా లెక్కల ఆధారంగా ఏర్పాటు చేస్తే అత్యధిక జనాభా ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఎక్కువ ఎంపీ సీట్లు పెరుగుతాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రస్తుతం 10 అసెంబ్లీ స్థానాలు, పునర్విభజన అనంతరం 14 లేదా 15 అయ్యే అకాశాలున్నాయి. వీటిలో 33 శాతం కనిష్ఠంగా 4 నుంచి గరిష్ఠంగా 5 స్థానాలు మహిళలకు కేటాయిస్తారు. ఎస్సీ, ఎస్టీ స్థానాలను కలుపుకొనే మహిళల రిజర్వేషన్ కల్పిస్తారు. అంటే రిజర్వేషన్ పురుషులు, మహిళలు అని మారుతూ ఉంటుంది. దీంతో రాజకీయంగా కొత్త వారికి అవకాశాలు వస్తాయి. పురుషులతోపాటు మహిళలు అవకాశాలు అందిపుచ్చుకొనే వీలు ఉంటుంది. తెలంగాణలో శాసనసభ నియోజకవర్గాల సంఖ్య 119 నుంచి 178కి చేరుకోనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రోరేటా ప్రాతిపదికన పునర్విభజన చేపట్టనున్నట్లు సంకేతాలిస్తున్న తరుణంలో రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న స్థానాలకు అదనంగా 50 శాతం పెరిగి.. మొత్తం స్థానాలు 178 కానున్నాయి. ఈ ప్రాతిపదికన హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోనే ఏకంగా 45 అసెంబ్లీ సీట్లు ఉండనున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో జనాభా అధికంగా ఉన్నందున.. రాజధానికి ఆనుకుని ఉన్న నియోజకవర్గాల్లో అసెంబ్లీ స్థానాలు పెరిగే అవకాశం అధికంగా ఉంది. హైదరాబాద్ జిల్లా పరిధిలో అసెంబ్లీ స్థానాలు 20 కానుండగా.. అందులో 7 మహిళలకు, ఒకటి ఎస్సీలకు రిజర్వ్ అవుతాయి. ఇక మేడ్చల్ జిల్లా పరిధిలో 12 అసెంబ్లీ స్థానాలు, రంగారెడ్డి పరిధిలో 12 నియోజకవర్గాలు ఉంటాయి. అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం సన్నాహాలు చేస్తుండటం ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. కొత్తగా పెరుగుతున్న నియోజకవర్గాల వల్ల ఎవరికి ప్రయోజనం? అన్న ప్రశ్న ఉత్కంఠకు గురిచేస్తోంది. సహజంగా నియోజకవర్గాల పునర్విభజన ఎప్పుడూ అధికార పార్టీకి అనుకూలంగా ఉంటుందని విశ్లేషిస్తుంటారు. అయితే తెలంగాణ వరకు వచ్చేసరికి ఈ పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంటుందా? అన్న అనుమానాలను రేకెత్తిస్తోంది. ఎన్నికల కమిషన్ పరిధిలో జరిగే ఈ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం నియంత్రించే అవకాశం ఉండగా, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుపుతోంది. దీంతో తెలంగాణ డీలిమిటేషన్ ప్రక్రియ ఉత్కంఠకు గురిచేస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణలో అదనంగా 50 శాతం సీట్లు పెరగనుండటం ఎవరికి అడ్వాంటేజ్ అన్న చర్చకు కారణమవుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. మరోసారి తన ప్రభుత్వమే వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో ప్రతిపక్షం బీఆర్ఎస్ కూడా వచ్చే ఎన్నికల్లో గెలుపుపై విశ్వాసంతో కనిపిస్తోంది. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వచ్చే ఎన్నికల నాటికి అధికారాన్ని అందుకోవాలని తెగతాపత్రయపడుతోంది. ఇలాంటి సమయంలో నియోజకవర్గాల పునర్విభజనను అనుకూలంగా మార్చుకోవాలని కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీగా వ్యవహరించే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు. కానీ రాష్ట్రంలో తమకు ఉన్న సంస్థాగత బలం.. ఉపయోగపడుతుందనేది బీఆర్ఎస్ లెక్కగా ఉంది. తెలంగాణలో ప్రస్తుతం 17 పార్లమెంటు నియోజకవర్గాలు ఉండగా, కాంగ్రెస్, బీజేపీ 2024 ఎన్నికల్లో ఎనిమిది స్థానాలు చొప్పున గెలుచుకున్నాయి. ఇక వచ్చే ఎన్నికలు జమిలి విధానంలో జరిగే అవకాశం ఉండటంతో బీజేపీ తనకు అనుకూలంగా డీలిమిటేషన్ జరిగేలా చూసుకుంటుందని అంటున్నారు. అయితే కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ డీలిమిటేషన్ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి చేయాల్సివుంటుందని, ఆ విధంగా కాంగ్రెస్ అడ్వాంటేజ్ గా మార్చుకునే పరిస్థితి కూడా ఉందంటున్నారు. మొత్తం మీద ఎవరేం చేసినా.. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లతో తెలంగాణలో రాజకీయ ముఖచిత్రం కచ్చితంగా మారుతుంది. అందుకు తగ్గట్టుగా అన్ని పార్టీలూ రాజకీయ వ్యూహాలు మార్చుకోక తప్పదు. ఇప్పటిదాకా పనిచేసిన సమీకరణాలు ఇకపై పనిచేయకపోవచ్చు. ఇప్పటిదాకా ప్రాధాన్యం దక్కని ప్రాంతాలు.. కొత్తగా కీలక పాత్ర పోషించవచ్చు. ఇక మహిళలకు రిజర్వయ్యే సీట్లు ఎక్కడ ఉంటాయి..? వాటిలో పాత సమీకరణాలు పనిచేస్తాయా..? కొత్త వ్యూహరచన చేయాలా..? అనే ప్రశ్నలు అన్ని పార్టీలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. సాధారణంగా దేశంలో నియోజక వర్గాలను జనాభా ప్రాతిపదికనే ఏర్పాటు చేస్తుంటారు. చివరిసారిగా... 1971 జనాభా లెక్కల ప్రకారం 1972లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. ఆ తర్వాత... నియోజకవర్గాల సంఖ్య పెరగలేదు. కానీ... కొన్ని పరిధులు, పేర్ల మార్పుతో 2009లో ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి ఏపీలో 2014 వరకు 294 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి 175 స్థానాలు, తెలంగాణకు 119 సీట్లు వెళ్లాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాలను పెంచుతామని రాష్ట్ర విభజన చట్టంలోనే పేర్కొన్నారు. ఈ లెక్కన ఏపీలోని అసెంబ్లీ స్థానాల సంఖ్య 175 నుంచి 225కు పెరగాలి. ఇప్పుడు అసెంబ్లీ స్థానాలను 50 శాతం పెంచనుండటంతో ఏపీలో నియోజకవర్గాలు 175 నుంచి ఒకేసారి 263కు చేరుకుంటాయి. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న 225 స్థానాలతో పోల్చితే ఇది చాలా ఎక్కువ. వెరసి... అసెంబ్లీలో ప్రజా ప్రతినిధుల సంఖ్య గణనీయంగా పెరగనుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో రాష్ట్ర వాటా 4.08 శాతం. ఆ నిష్పత్తి ప్రకారం ఏపీకి వచ్చే లోక్‌సభ స్థానాలు 33 మాత్రమే. ఉత్తరాదితో పోల్చితే మనకు అన్యాయం జరుగుతుంది. అయితే... జనాభా ప్రాతిపదికన కాకుండా, 50 శాతం సీట్లు పెంచాలన్న కేంద్ర నిర్ణయం ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాలన్నింటికీ మేలు చేసేదే. దీని ప్రకారం... రాష్ట్రంలో లోక్‌సభ స్థానాల సంఖ్య ఇప్పుడున్న 25 నుంచి 37 లేదా 38కి చేరుతుంది. రాష్ట్ర విభజన సమయంలోనే నియోజకవర్గాల పునర్విభజన అంశం చర్చకు వచ్చినప్పటికీ... ఇప్పటివరకు అమలుకాలేదు. తాజా పరిణామాలతో ఈ అంశం మళ్లీ రాజకీయంగా హాట్‌టాపిక్‌గా మారింది. తెలుగు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన ప్రస్తావన వచ్చింది కానీ ఇప్పటి వరకు దాని ప్రస్తావన రాలేదు. ఇప్పుడు అంతకంటే ఎక్కువగానే సీట్లు పెరగడంతో పాటు.. వీటిలో 87 అసెంబ్లీ స్థానాలు మహిళలకు రిజర్వ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఏపీలో ప్రస్తుతం కొన్ని రాజకీయ సమీకరణాలు ఉన్నాయి. ఉమ్మడి ఏపీ సమీకరణాలకు, ప్రస్తుత ఏపీ సమీకరణలకూ ఇప్పటికే తేడా వచ్చింది. విభజన తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లో ఆ తీరు స్పష్టమైంది. అలాంటిది ఇప్పుడు డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ ఒకేసారి అమలు చేస్తే.. రాజకీయ ముఖచిత్రం సరికొత్తగా ఆవిష్కృతమౌతుందనడంలో సందేహం లేదు. అప్పుడు అన్ని పార్టీలూ ఎన్నికల కోసం కొత్తగా సిద్ధమవక తప్పదు. పాత బలాలు, బలహీనతలు పక్కనపెట్టి.. నేతలంతా కొత్త రాజకీయ స్థితిగతుల్ని అవగాహన చేసుకుంటూ.. తమ పార్టీలను ముందుకు నడపాల్సి ఉంటుంది. అందుకే డీలిమిటేషన్‌తో ఏం జరుగుతుంది..? ఎవరి అవకాశాలు ఎలా ప్రభావితం అవుతాయి..? వంటి ప్రశ్నలతో అన్ని పార్టీలూ ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. అటు నియోజకవర్గాల స్థాయిలో నేతలు కూడా తమ రాజకీయ భవిష్యత్తు ఏమవుతుందా అని సరిచూసుకుంటున్నారు. పునర్విభజనలో పక్క నియోజకవర్గాల ప్రాంతాలు చేరితే ఏమౌతుంది..? ఉన్న ప్రాంతాలు కొన్ని పోతే విజయావకాశాల సంగతేంటి..? అనే ప్రశ్నలు వేసుకుని.. ప్రిపేర్ అయ్యే పనిలో ఉన్నారు. అంతటితో ఆగకుండా ఈ విషయంలో అనుచరులు, సహచరుల అభిప్రాయాలు కూడా తీసుకుంటున్నారు. ఏ ప్రతిపాదననూ కొట్టిపారేసే పరిస్థితి లేకపోవడంతో.. డీలిమిటేషన్ ఎలా జరిగినా.. తాము సంసిద్ధంగా ఉండాలనే కోణంలో రెడీ అవుతున్నారు. ఒకవేళ తాము ప్రాతినిధ్యం వహిస్తున్న సీటు మహిళలకు రిజర్వ్ అయితే.. అందుకు తగ్గట్టుగా ఓ మహిళా నేతను కూడా సొంత కుటుంబం నుంచో.. లేదంటే తనకు నమ్మకమైన వారినో నిలబెట్టే దిశగానూ వ్యూహాలు రచిస్తున్నారు. మహిళా అభ్యర్థులు రెడీగా ఉన్న కొందరు నేతలు.. తనకు కాకపోతే కుటుంబ సభ్యులకు టికెట్ ఇవ్వాలనే హామీ ముందే అధిష్ఠానాల దగ్గర నుంచి తీసుకుంటున్నారనే చర్చ కూడా జరుగుతోంది. ఇలాంటి నేతల విషయంలో పార్టీలు కూడా చాలా వరకు సానుకూలంగానే ఉంటున్నాయి. ఇలాంటి వారిని ఎంకరేజ్ చేస్తే.. గెలుపు సంగతి వారే చూసుకుంటారనే లెక్కల్లో పార్టీలున్నాయి. జనాభా గణన అనంతరం విధిగా జరిగే నియోజక వర్గాల పునర్విభజన ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒకే విలువ అన్న సూత్రం ప్రాతిపదికన జరగాలని రాజ్యాంగ నిబంధన పేర్కొంది. కానీ ఇప్పుడు కేంద్రం మాత్రం 2011లో చేసిన జనగణన ఆధారంగా డీలిమిటేషన్‌కు రెడీ అయింది. లోక్‌సభకు ఎన్నికయ్యే ప్రతి సభ్యుడు ప్రాతినిధ్యం వహించే ఓటర్ల సంఖ్య సమానంగా ఉండి తీరాలని ..ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒకే విలువ అనే ప్రజాస్వామిక సూత్రం నిర్దేశిస్తుంది. ఈ సూత్రం ఉల్లంఘనకు గురైతే పెద్ద నియోజకవర్గాలలోని ఓటు విలువ చిన్న నియోజకవర్గాలలోని ఓటు విలువ కంటే తక్కువగా ఉంటుంది. ఈ సూత్రాన్ని ఏ మేరకు ఫాలో అవుతారనేది చూడాల్సి ఉంది. ప్రస్తుతానికి 50 శాతం సీట్ల పెంపు అని చెబుతున్నా.. సమాన ఓటు విలువ విషయంలో తేడాలొస్తాయేమోననే సందేహాలు లేకపోలేదు. జనాభాకు, లోక్‌సభ సభ్యుల సంఖ్యకు గల నిష్పత్తి సాధ్యమైనంతవరకు అన్ని రాష్ట్రాలకు ఒకేవిధంగా ఉండాలి. ఏతావాతా ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా.. ప్రజా ప్రాతినిధ్యానికి ఇబ్బంది లేకుండా డీలిమిటేషన్ చేయాలనేదే రాజ్యాంగం సూత్రీకరణ. దేశంలో గతంలో జరిగిన పునర్విభజన ప్రక్రియలు కూడా ఇదే విషయం చెబుతున్నాయి. మరి ఇప్పుడు జరిగే డీలిమిటేషన్ ఎలా జరుగుతుందోనని ఏపీతో పాటు అన్ని రాష్ట్రాలూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి.

సంపాదకీయం పేజీలో రచనలు పంపవలసిన వాట్సప్ నంబర్ ,మెయిల్ ఐడి
9951512539
flashindia999@gmail.com

# నెల రోజులైనా ధాన్యం కొనరా?

**మాచారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** వరి ధాన్యం నూర్పిడి చేసిన వరి కల్లాలు తరలించి నెలరోజులు గడుస్తున్నా కాంటా చేయడంలో అధికారులు, నిర్వాహకులు అలసత్వం ప్రదర్శించడంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన నాటి నుంచి మాచారెడ్డి మండలం లోని సోమార్పేట గ్రామంలో వరి నూర్పుళ్ళు వేగంగా జరిగాయి. ధాన్యం కల్లాలకు తరలించి ఆరబెట్టి కుప్పలు చేసుకొని కాంటా కోసం ఎదురుచూస్తున్నారు. ఇంతవరకు హమాలీలు కానీ, నిర్వాహకులు కానీ కళ్ళం వైపు వచ్చి చూసిన పాపాన పోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకుంటే మరింత నష్టం జరిగే అవకాశం ఉంటుందని వాపోయారు. ప్రభుత్వం ధాన్యాన్ని దళారులకు అమ్మవద్దని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి గిట్టుబాటు పొందాలని సూచిస్తుంది. కానీ ధాన్యం నెలల తరబడి కల్లాల్లోనే మగ్గిపోవడం పట్ల ఎలాంటి స్పందన లేకపోవడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు.

**రైస్ మిల్లులకు తరలుతున్న ధాన్యం..**

కల్లాల్లో పోసిన ధాన్యం కొంటారో కొనరో అనే సందిగ్ధ పరిస్థితుల్లో రైతులు పంట నూర్పిడి కాగానే నేరుగా రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు 2389 రూపాయలు కాగా రైస్ మిల్లులు క్వింటాలుకు 1750 కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతు క్వింటాలుకు 600లకు పైగా గిట్టుబాటు కోల్పోతున్నాడు. ఆరబెట్టడం, క్లీన్ చేయడం, కుప్పబోయడం వంటి శ్రమ తగ్గడంతో పాటు ప్రకృతి వైపరీత్యాల నుంచి దూరంగా ఉండవచ్చని, తను నష్టపోయిన దానికి సమర్థించుకోవడం రైతన్న వంతయింది.

**పొరుగు రాష్ట్రం హమాలి పైనే ఆధారం..**

ధాన్యం కొనుగోలు కేంద్రాలు కాంటా చేయడం లోడు చేయడం వంటి పనులు స్థానికంగా ఎవరు చేయడం లేదు. పొరుగు రాష్ట్రం నుంచి వచ్చిన వారు మాత్రమే హమాలీ పని చేస్తున్నారు. స్థానికులంతా వారిపైనే ఆధారపడడంతో కొనుగోలు జాప్యం జరగడానికి కారణంగా చెబుతున్నారు. హమాలీకి క్వింటాలుకు 30 నుంచి 35 రూపాయల వరకు రైతులు చెల్లిస్తారు. ఆ విధంగా స్థానికులు ఎవరైనా ముందుకు వస్తే ఉపాధి అవకాశం కూడా దొరికేదని అభిప్రాయపడుతున్నారు.

**ధాన్యం కొనుగోళ్లపై సీఎంఆర్ ఎఫెక్ట్..**

ధాన్యం కొనుగోళ్లపై రైస్ మిల్లుల సీఎంఆర్ ఎఫెక్ట్స్ కూడా ఉంటుందని కొందరు నిర్వాహకులు తెలిపారు. జిల్లాలో 180 కి పైగా రైస్ మిల్లులు ఉండగా 70 కి పైగా సీఎంఆర్ ఇవ్వని రైస్ మిల్లుల పై డిఫాల్టర్ కింద పౌరసరఫరాల శాఖ చర్యలు తీసుకోవడం జరిగింది. దీంతో జిల్లాలో ఉత్పత్తయ్యే ధాన్యం కేవలం 110 మిల్లుల కు తరలిస్తే అన్ లోడింగ్ సమస్యతో దాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు పడే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. బాయిల్డ్ రైస్ వద్దని, రా రైస్ మాత్రమే ఇవ్వాలని, బియ్యం పై ఎలాంటి మచ్చలు ఉండద్దని తదితర ఆంక్షల నేపథ్యంలో ధాన్యం తరలింపులో జాప్యం జరుగుతున్నట్లుగా తెలుస్తోంది.

**ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలి: రైతు రాంరెడ్డి**

ధాన్యం కొనుగోలును వెంటనే ప్రారంభించాలని రైతు బానోతు రామిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. నెల రోజుల నుంచి కల్లాల్లో ధాన్యం ఆరబోసినట్టు తెలిపారు. ప్రస్తుతం పెరిగిన ఉష్ణోగ్రతల వల్ల ఆ ధాన్యం మురమురాలుగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అకాల వర్షాలు కురిస్తే మాత్రం తమ నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నించారు. రైతు భరోసా ఇవ్వకున్నా తాము పండించిన ధాన్యమైన కొనుగోలు చేయాలని ఆయన కోరారు. పంట పెట్టుబడికి లక్షల రూపాయల అప్పులు తెచ్చామని, సరైన సమయంలో చెల్లించకుంటే వడ్డీలకు సరిపోమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని ధాన్యం కొనుగోలు ను ప్రారంభించాలని కోరారు.

# రాజకీయ అస్త్రంగా కాళేశ్వరం..

**వరంగల్,ఫ్లాష్ ఇండియా :** కాళేశ్వరం ప్రాజెక్టు మళ్లీ రాజకీయ దుమారం రేపుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య మళ్లీ చర్చకు తెరలేపింది. పోటా పోటీగా కాళేశ్వరం పర్యటనకు రెండు పార్టీలు సిద్ధం కావడంతో రాజకీయ ఉత్కంఠ రేపుతుంది. సీఎం రేవంత్ రెడ్డి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించేందుకు ఈ నెల 20న వస్తున్నారు. సీఎంతో పాటు మంత్రులు హాజరు కానుండడంతో పాటు భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. దీనికి రెండు రోజుల ముందే బీఆర్ఎస్ నేతలు పర్యటన ఉండడంతోపాటు అదే రోజు జగిత్యాలలో బహిరంగ సభను నిర్వహిస్తున్నారు. ఈ సభలో కేసీఆర్ కూడా పాల్గొంటుండటంతో కాళేశ్వరం మళ్లీ రాజకీయ అస్త్రంగా మారుతుంది.

**20న సీఎం రాక..**

సీఎం రేవంత్ రెడ్డి ఈనెల 20న భూపాలపల్లి జిల్లాలో పర్యటించనున్నారు. కాళేశ్వరానికి సంబంధించి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలిస్తారు. మేడిగడ్డ వద్ద అధికారులతో సమీక్షిస్తారు. అక్కడి నుంచి కాటారం మండలంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ సభ వేదికగా పలు కీలక అంశాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించనున్నారు. అదే రోజు రైతు భరోసా రెండో విడత నిధులను కూడా విడుదల చేయనున్నారు. సీఎం పర్యటన సందర్భంగా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రాజెక్టుకు సంబంధించిన బ్యారేజీల పరిశీలనతో పాటు బహిరంగ సభ ఏర్పాట్లను చూస్తున్నారు.

**బ్రతుకుతారు : ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు**

మంత్రి శ్రీధర్ బాబు కాటారంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సీఎం బ్యారేజీలను పర్యవేక్షించి పలు పథకాలకు కూడా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనుండటంతో భారీ ఏర్పాట్లను చేస్తున్నారు. బహిరంగ సభకు భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాలతో పాటు ఉమ్మడి జిల్లాలకు చెందిన నేతలు కూడా హాజరయ్యే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జగిత్యాలలో అదేరోజు జరిగే బీఆర్ఎస్ సభకు కౌంటర్ గా పలు ఆరోపణలు చేసే అవకాశం ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులకు సిద్ధమవుతున్న ప్రభుత్వం ఇప్పటికే ఏర్పాట్లను చేస్తుంది. సైటును పరిశీలించి అక్కడే సమీక్షించి పనులను వేగవంతం చేసే విధంగా సీఎం అధికారులను ఆదేశించనున్నారు. మంథని మండలంలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులపైన కూడా సీఎం మాట్లాడే అవకాశం ఉంది. కాళేశ్వరం వేదికగానే ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి పలు దఫాలు బ్యారేజీలను పరిశీలించారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని ప్రకటించడంతో పాటు ప్రజల్లోకి తీసుకెళ్లి అధికారంలోకి వచ్చారు. జయంత్ ఘోష్ కమిషన్ ను నియమించి కాళేశ్వరం పై పూర్తి వివరాలు తీసుకొని చర్యలకు ఉపక్రమించారు. ఎన్నికల నినాదంగా మారి అధికారంలోకి తెచ్చిన కాంగ్రెస్ మరోదఫా ఆ ప్రాజెక్టు వేదికగానే ముందుకు పోతుంది. మంథని నియోజకవర్గంలో జరుగుతున్న ఈ సభను విజయవంతం చేసేందుకు మంత్రి శ్రీధర్ బాబు పూర్తిస్థాయిలో ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సభ విజయవంతం కోసం కృషి చేస్తున్నారు. అధికారులతో సమీక్షిస్తూనే పలు ఏర్పాట్లు చేస్తున్నారు.

**జగిత్యాలలో బీఆర్ఎస్ సభ..**

జగిత్యాలలో ఈనెల 20న సభ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నేతలు సీఎం పర్యటనకు రెండు రోజుల ముందే కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు వస్తున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఈ బ్యారేజీలను పరిశీలించనున్నారు. మోటారు పనుల పరిశీలనతో పాట పలు అంశాలపై దృష్టి పెట్టనున్నారు. సీఎం పర్యటనకు రెండు రోజుల ముందే పోటీగా పర్యటనకు వస్తుండటంతో ఉత్కంఠ రేపుతుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు సమాయత్తం అవుతుండటంతో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. రెండు పార్టీల మధ్యన ఉద్రిక్తలు తలెత్తకుండా ఉండేందుకు ముందస్తుగానే ఏర్పాట్లను చేస్తున్నారు. పోలీసులు దృష్టి పెట్టి పనిచేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోటా పోటీగా వస్తుండటంతో రాజకీయ వాతావరణం ఉద్రిక్తంగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టును తేవడంతోనే తెలంగాణ సస్యశ్యామలమైందని బీఆర్ఎస్ నేతలు ప్రకటిస్తుండగా భారీ అవినీతి జరిగిందని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల రెండు పార్టీలకు ప్రధాన అస్త్రంగా ఉన్న కాళేశ్వరం మళ్లీ భారీ చర్చలకు రెండు పార్టీల నేతల పర్యటనతో మొదలైంది. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుతం ఉపయోగపడకుండా పార్టీలకు మాత్రం రాజకీయ అస్త్రంగా మారింది. బీఆర్ఎస్ హయాంలో భారీ ఎత్తున ఈ ప్రాజెక్టుపై పెట్టుబడులు పెట్టగా బ్యారేజీలను అనుసంధానంగా నిర్మించారు. వాటి ఆధారంగా నీటిని మళ్లించారు. గోదావరి నుంచి నీటిని ఎత్తిపోసి రంగారెడ్డి జిల్లా వరకు తరలిస్తున్నారు. కాళేశ్వరం వద్ద మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగడంతో నీటిని ఎత్తలేదు. మోటార్ల వినియోగం చేయలేదు. ప్రస్తుతం మరమ్మతులకు సిద్ధమవుతున్న ప్రభుత్వం రాజకీయ వేదికగా కాంగ్రెస్ పార్టీ నేతలు వినియోగిస్తున్నారు. కౌంటర్ ఇచ్చేందుకు బీఆర్ఎస్ నేతలు పర్యటన జరుపుతున్నట్లు తెలుస్తోంది. రెండింటి నిర్ణయం ఎలా ఉన్నా మరోసారి రాష్ట్ర వ్యాప్త చర్చకు ప్రాజెక్టు వేదికగా మారింది.



# కాలి బూడిదైన ఏసీ స్లీపర్ బస్సు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నగరంలో శుక్రవారం రాత్రి జరిగిన భారీ బస్సు ప్రమాదం కలకలం రేపింది. మియాపూర్ నుంచి పాలకొల్లుకు వెళ్తున్న 'శ్రీ దుర్గా మహేశ్వరి ట్రావెల్స్'కు చెందిన ఏసీ స్లీపర్ బస్సు, కెపిహెచ్‌బి పరిధిలోని పద్మావతి ప్లాజా బస్ స్టాప్ వద్దకు చేరుకోగానే మొదట బస్సు డ్రైవర్ క్యాబిన్ నుండి పొగలు వచ్చాయి. మంటలను గమనించిన డ్రైవర్, క్లీనర్ వెంటనే అప్రమత్తమయ్యి, బస్సును పక్కకు ఆపి, అందులో ఉన్న 18 మంది ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించేశారు. ప్రయాణికులు ప్రాణాలతో బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత మంటలు వేగంగా విస్తరించి, బస్సును పూర్తిగా మింగేశాయి. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది సమయస్ఫూర్తితో మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంతో జెఎన్‌టియు మెట్రో స్టేషన్ సమీపంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనదారులను వేరే మార్గాల్లోకి మళ్లించడం ద్వారా పోలీసులు పరిస్థితిని చక్కదిద్దారు. బస్సు కాలిపోవడానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా వెల్లడి కాలేదు. ప్రాథమిక విచారణలో ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్, ఏసీ యూనిట్‌లో సాంకేతిక సమస్యల వల్లే మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఫోరెన్సిక్ టీమ్స్ బస్సును పరిశీలించాక అసలు కారణం తెలిసే అవకాశం ఉంది.





# కాంగ్రెస్ ఎంపీలకు సొంత పార్టీ నుంచే చీవాట్లు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీలు వ్యవహరించిన తీరుపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను అవమానపరుస్తూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాట్లాడుతున్నప్పుడు మౌనంగా ఉండటం ఏంటని మండిపడుతున్నారు. ఆయన మాటలను వెంటనే ఖండించేందుకు ఎంపీలు చొరవ చూపలేదని ఆరోపిస్తున్నారు. గురువారం లోకసభలో మహిళా రిజర్వేషన్ల బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా కర్ణాటకకు చెందిన ఎంపీ తేజస్వీ రాష్ట్ర విభజనను దేశ విభజనతో పోల్చారు. ఆ సమయంలో రాష్ట్రానికి చెందిన 8మంది కాంగ్రెస్ ఎంపీలు సభలోనే ఉన్నారు. కానీ ఎవరూ కౌంటర్ ఇచ్చేందుకు ప్రయత్నించలేదు. బీజేపీ ఎంపీ కామెంట్స్‌పై బీఆర్ఎస్ మాత్రం తీవ్రంగా స్పందించింది. ఏకంగా ఆ పార్టీకి చెందిన కీలక నేతలు అందరూ బీజేపీ ఎంపీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో కాంగ్రెస్ మంత్రులు రంగంలోకి బీజేపీ ఎంపీ మాటలను ఖండించారు. కానీ పార్లమెంట్‌లోనే కౌంటర్ ఇవ్వాల్సిన కాంగ్రెస్ ఎంపీలు మాత్రం మరుసటిరోజు స్పందించారు. తేజస్వీపై యాక్షన్ తీసుకోవాలంటూ పార్లమెంట్ బయట నిరసన తెలిపారు. అయితే ముందు రోజు మౌనంగా ఉన్న ఎంపీలు 24 గంటల తరువాత మేల్కొనడానికి కారణం సొంత పార్టీ నేతలు, తెలంగాణవాదులు ఫోన్ చేసి చీవాట్లు పెట్టడమేనని ప్రచారం జరుగుతున్నది.

# కాపర్ మాయంపై రికార్డుల పరిశీలన

**కొత్తగూడెం,ఫ్లాష్ ఇండియా :** సింగరేణి కార్పొరేట్ ఏరియాలో బ్రిటిష్ కాలం నాటి కాపర్ వైర్ మాయంపై విజిలెన్స్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. 'దిశ' దిన పత్రికలో ప్రచురితమైన కథనాలకు సింగరేణి ఉన్నతాధికారులు స్పందించారు. శుక్రవారం ఉదయం విజిలెన్స్ అధికారులు మెయిన్ వర్క్ షాప్‌నకు చేరుకొని విచారణ చేపట్టారు. అయితే అవినీతి చేసిన ఆ అధికారి విచారణకు హాజరు కాకుండా తప్పించుకునేందుకు విజిలెన్స్ అధికారులను విసిగించినట్లు సమాచారం. సాయంత్రం 5గంటల వరకు మెయిన్ వర్క్ షాప్‌నకు రాకుండా కాలయాపన చేసి తప్పించుకునేందుకు పథకం వేసినప్పటికీ సింగరేణి ఉన్నతాధికారి ఆ అధికారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయగా సాయంత్రం విచారణకు హాజరైనట్లు తెలుస్తోంది. క్షేత్ర స్థాయిలో సక్రమంగా విచారణ చేపడితే ఖచ్చితంగా అధికారులు చేసిన అవినీతి గుట్టు అయ్యే అవకాశం ఉందని కార్మికులు చెబుతున్నారు.

**సింగరేణి రూల్స్‌కు విరుద్ధంగా..**

సింగరేణి కార్పోరేట్ ఏరియాలో బ్రిటీష్ కాలం నాటి కాపర్ వైర్‌ను తొలగించి, ఆ కాపర్‌ను వర్క్‌షాప్‌నకు తీసుకువచ్చే సమయంలో ఎన్ని టన్నులు తొలగించింది, ఎంత బరువు ఉన్నది ఇవేమీ లెక్కలేమీ రికార్డుల్లో చూపలేదని, కోట్ల రూపాయల విలువ చేసే ఆ కాపర్‌ను ఎంట్రీ చేయలేదని, తీసుకువచ్చిన కాపర్‌ను డీవైఎస్ఈ, ఓ ఏజీఎంల స్థాయి అధికారులు, ఓ ఫోర్ మెన్ ఈఈ త్రిమూర్తులు రింగై స్క్రాప్ గా చూపి అమ్ముకొని , వాటాలు వేసుకొని పంచుకొని ఆస్తులు కూడబెట్టుకున్నట్లు కార్మిక వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే తొలగించిన కాపర్ వైర్ ను లెక్క చూపకుండా కార్పొరేట్ ఏరియాలోని ఫిల్టర్ బెడ్ లో ఉన్న కాపర్ వైర్ ను మెయిన్ వర్క్ షాపుకు తీసుకొచ్చినట్లు సమాచారం. అంతేకాకుండా గతంలో కొత్తగూడెం ఏరియాలో మూసివేసిన గనిలో ఉన్న కాపర్ వైర్‌ను పీవీకే 5 ఇంక్లైన్లో భద్రపరిచారు. అయితే ఆ అతి తెలివి అధికారులు ఎర్త్ పిట్లకు కాపర్ వైర్ కావాలని ఉన్నతాధికారులకు నోట్ ఫైల్ పెట్టి పీవీకే 5ఇంక్లైన్లోని కాపర్ వైర్‌ను తీసుకువచ్చి బ్రిటీష్ కాలం నాటి కాపర్ వైర్ ఇదేనని నమ్మించే ప్రయత్నం చేస్తున్నట్లు కార్మికులు ఆరోపిస్తున్నారు. అయితే ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే కోట్లు విలువ చేసే బ్రిటీష్ కాలంనాటి వైర్‌ను అమ్ముకున్న అధికారులు ఆ స్థానంలో ఈ కాపర్ వైర్ ను ఉంచి లెక్క చూపే ప్రయత్నం చేస్తున్నారని, అయితే తొలగించిన కాపర్ వైర్‌ను ఎర్త్ పిట్లకు వినియోగించుకోవాలన్న సరే డీజీఎం స్థాయి అధికారి డైరెక్టర్‌కు నోట్ ఫైల్ పెడితేనే డైరెక్టర్ అప్రూవల్ ఇవ్వాలి. అప్రూవల్ వచ్చిన తర్వాత జీఎం తూకం వేసి ఎన్ని టన్నులు కాపర్ ఇవ్వాలి అనేది నిర్ణయించి సంబంధిత అధికారులు అందజేస్తారు. కానీ ఇక్కడ ఇవేమీ జరగలేదు. అసలు డీవైఎస్ఈ ఎటువంటి అనుమతి తీసుకోకుండానే తన సొంత నిర్ణయంతో సింగరేణి నియమనిబంధనలకు విరుద్ధంగా ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన కాపర్‌ను ఎర్త్ పిట్లకు వినియోగించి అదే బ్రిటిష్ కాలం నాటి కాపర్ వైర్ అని నమ్మించే ప్రయత్నం చేశారని కార్మికులు ఆరోపిస్తున్నారు. అవినీతి బయటపడకుండా ఉండేందుకు గత కొంతకాలంగా ఆ అధికారులు, ఫోర్‌మెన్ ఆపసోపాలు పడుతున్నారని కార్మికులు గుసగులాడుకుంటున్నారు. ఈ విషయం పై ఎవరైనా ఇతరులకు సమాచారం ఇస్తే తన పవరేంటో చూపిస్తానని డీవైఎస్ఈ హెచ్చరించినట్లు తెలుస్తోంది. చండశాసనుడిగా మారతానని ఏం చేయాలో తనకు తెలుసని, ఎలా తప్పించుకోవాలో కూడా తనకు తెలుసని, వర్క్‌షాప్‌లో జరుగుతున్న విషయాలు బయటకు చెబితే ఊరుకోబోమని చిందులేస్తున్నట్లు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**విచారణ జరిగితే మరిన్ని..**

విచారణకు వచ్చిన అధికారులు గత కొన్నేళ్లుగా ఈయన వ్యవహారంపై సక్రమంగా విచారణ జరిగితే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందంటున్నారు కార్మికులు. వివాదాస్పద అధికారిగా పేరున్న అతనిపై గతంలో కూడా పలు ఆరోపణలు వచ్చాయి. అయితే తనకు సింగరేణిలో ఉన్నతాధికారులు తెలుసని, ఎవరిని ఎలా మేనేజ్ చేయాలో కూడా తనకు తెలుసని ప్రగల్భాలు పలుకుతారని కార్మికులు చెబుతున్నారు. నేనే నిజాయితీ పరుడినని అన్నట్లుగా గత కొన్నాళ్లుగా బిల్డప్ ఇస్తూ చేసిన అవినీతిని పక్కదారి పట్టించేందుకు పలు రకాలుగా ప్రయత్నాలు చేసినా ఆలస్యంగానైనా ఆయన చేసిన అవినీతి బయటపడేసరికి కార్మికులపై చిందులు వేస్తూ ఎవరూ ఇక్కడ జరుగుతున్న విషయాలు బయటకు చెప్పవద్దంటూ హెచ్చరించడం పై కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో ఏజీఎం స్థాయిలో ఉన్న అధికారి ప్రస్తుతం సింగరేణి విజిలెన్స్ విభాగంలో ఉన్నతాధికారిగా ఉండడం పై ఇందులో ఆ అధికారి పాత్ర కూడా ఉందని ఆరోపణలు రావడం మరి విజిలెన్స్ ఉన్నతాధికారులను ఏమైనా ప్రభావితం చేస్తారేమోనని అనుమానాలు కార్మికుల్లో బలపడుతున్నాయి. కానీ నిష్పక్షపాతంగా విచారణ జరిగితే కచ్చితంగా వీరు చేసిన అవినీతి బయటపడటం రుజువు కావడం ఖాయమంటున్నారు కార్మికులు. విజిలెన్స్ ఉన్నతాధికారులు సంస్థకు నష్టం చేకూర్చే వారిని పట్టుకొని సంస్థ పేరు నిలబెడుతారో లేక అవినీతి అధికారులకు వంతపాడుతారో అని కార్మికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఇక అంతా డిజిటల్ మయం!

## రవాణా శాఖలో 'వాహన్' సందడి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రవాణా శాఖలో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వాహన సేవలను మరింత సరళీకృతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ నేషనల్ ఇన్ ఫర్ మెటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) సహకారంతో ప్రవేశపెట్టిన వాహన్ పోర్టల్ రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్నది. ప్రస్తుతం ఈ పోర్టల్ సేవలు దశలవారీగా స్టెబిలైజ్ అవుతుండటంతో వచ్చే 15 రోజుల్లో పూర్తి స్థాయి సేవలు అందుబాటులోకి రానున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

**రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పురోగతి**

కొద్దిరోజులుగా ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఈ డిజిటల్ వ్యవస్థలో ఇప్పటికే కీలక మైలురాళ్లను అధిగమించినట్టు రవాణా శాఖ తెలిపింది. కొత్త వాహనాలకు తాత్కాలిక రిజిస్ట్రేషన్(టీఆర్) ప్రక్రియ విజయవంతంగా సాగుతున్నది. దీనికి సంబంధించిన మాడ్యూల్ ప్రస్తుతం పూర్తిస్థాయిలో సేవలకు సిద్ధమైందని అధికారులు తెలిపారు. శాశ్వత రిజిస్ట్రేషన్(పీఆర్) సైతం క్రమంగా వేగం పుంజుకుందని అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపు 2200 వాహనాలకు శాశ్వత రిజిస్ట్రేషన్ నంబర్లను కేటాయించారు. మరోవైపు ప్రత్యేక నంబర్ల కోసం నిర్వహించే వేలం పాటలనూ ఆన్‌లైన్ చేశారు. ఇప్పటివరకు 858 వేలం పాటలు విజయవంతంగా ముగిశాయి. దీనివల్ల పారదర్శకత పెరగడమే కాకుండా పైరవీలకు తావులేకుండా పోయింది.

**ఎన్ఐసీ పర్యవేక్షణ**

సాంకేతిక కారణాలతో అక్కడక్కడ చిన్నపాటి ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ వాహన్ పోర్టల్ పనితీరును ఎన్ఐసీ బృందం నిరంతరం పర్యవేక్షిస్తున్నది. మిగిలిన మాడ్యూల్స్‌ను కూడా అనుసంధానించే ప్రక్రియ వేగంగా జరుగుతోంది. మరో రెండు వారాల్లో వ్యవస్థ మొత్తం స్థిరపడితే పౌరులు ఎలాంటి అంతరాయం లేకుండా ఇంటి నుంచే రవాణాశాఖ సేవలను పొందే వీలుంటుందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. డిజిటలైజేషన్ వైపు మళ్లుతున్న క్రమంలో సాంకేతిక మార్పులతో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఏర్పడిన జాప్యాన్ని భరించిన వాహన డీలర్లు, ప్రజలకు రవాణాశాఖ కృతజ్ఞతలు తెలిపింది. ప్రజలకు మరింత జవాబుదారీతనంతో సమర్థవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ కొత్త వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని.. ఈ ప్రయత్నంలో కొన్ని ఇబ్బందులు తలెత్తాయని రవాణాశాఖ అధికారులు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ బాధ్యతగా పేర్కొన్నారు.

# ఆందోళనలకు పిలుపునిచ్చిన ఎన్డీఏ

**ఢిల్లీ :** మహిళా సాధికారతకు అత్యంత కీలకమైన మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్‌సభలో వీగిపోవడం దేశ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఈ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగానే అడ్డుకున్నాయని ఆరోపిస్తూ, ఎన్డీయే కూటమి దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. ఈ పరిణామంతో దేశవ్యాప్తంగా రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ప్రతిపక్షాల తీరును నిరసిస్తూ క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లేందుకు ఎన్డీయే పక్షాలు సిద్ధమయ్యాయి. లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందకపోవడంతో, కేంద్ర మంత్రులు , ఎన్డీయే కూటమి అగ్రనేతలు పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో అత్యవసరంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, ధర్మేంద్ర ప్రధాన్, అర్జున్ రామ్ మేఘ్వాల్ సహా పలువురు కీలక నేతలు పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ల కోసం కేంద్రం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తుంటే, ప్రతిపక్షాలు కావాలనే అడ్డుపడ్డాయని, దీనిపై ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని ఈ సమావేశంలో నిర్ణయించారు. మహిళా సాధికారతకు అడ్డుపడుతున్న ప్రతిపక్షాల చర్యను ఎండగట్టాలని ఎన్డీయే నిర్ణయించింది. ఇందులో భాగంగానే నేడు దేశంలోని అన్ని ప్రధాన పట్టణాలు , జిల్లా కేంద్రాల్లో భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌ను ప్రతిపక్షాలు ఏ విధంగా కాలరాశాయో ప్రజలకు వివరిస్తూ ఎన్డీయే నేతలు ఈ ఆందోళనల్లో పాల్గొననున్నారు.

ఈ నిరసనల ద్వారా మహిళా ఓటర్లను తమవైపు తిప్పుకోవడంతో పాటు, ప్రతిపక్ష పార్టీలను మహిళా వ్యతిరేకులుగా చిత్రించేలా ఎన్డీయే వ్యూహరచన చేస్తోంది. రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. మహిళా రిజర్వేషన్ బిల్లుపై ప్రతిపక్షాల వైఖరిని ఎండగడుతూ ఎన్డీయే చేస్తున్న ఈ పోరాటం రాజకీయంగా ఎటువంటి మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.

# హిట్ అండ్ రన్ కేసులో లొంగిపోయిన రాహెల్





**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** 2022 నాటి జూబ్లీహిల్స్ 'హిట్ అండ్ రన్' కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఘటన జరిగినప్పటి నుంచి పోలీసులకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్న బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహిల్ శనివారం (ఏప్రిల్ 18, 2026) పోలీసుల ఎదుట లొంగిపోయాడు. 2022లో జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లో జరిగిన వివాదాస్పద 'హిట్ అండ్ రన్' కేసులో రాహిల్ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు.

**కేసు నేపథ్యం..**

2022లో జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45 వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు గాయపడ్డారు. ఈ ప్రమాదానికి కారణమైన కారును రాహిల్ నడిపినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. అయితే.. ప్రమాదం జరిగిన వెంటనే నిందితుడు పరారీలోకి వెళ్లారు. అప్పట్లో ఈ కేసు రాజకీయంగా కూడా పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. నిందితుడిని కాపాడేందుకు పోలీసులపై ఒత్తిడి వచ్చిందనే ఆరోపణలు కూడా వచ్చాయి.

**కోర్టు ఆదేశాలతో లొంగుబాటు..**

ప్రమాదం జరిగిన నాటి నుంచి రాహిల్ దుబాయ్, ఇతర ప్రాంతాల్లో తలదాచుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే కోర్టు అతనికి వ్యతిరేకంగా కీలక ఆదేశాలు జారీ చేయడంతో, ఇక తప్పనిసరి పరిస్థితుల్లో ఆయన పోలీసుల ఎదుట లొంగిపోవాల్సి వచ్చినట్లు తెలుస్తుంది. శనివారం పోలీసుల ముందుకు వచ్చిన రాహిల్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు, తదుపరి విచారణ నిమిత్తం కోర్టులో హాజరుపరచనున్నారు.

# విధానాల ప్రకారమే ధాన్యం కొనుగోలు చేయాలి



**నల్లగొండ,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వం రూపొందించిన విధి విధానాల ప్రకారమే ధాన్యం సేకరణ చేయాలని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎన్. కోదండ రెడ్డి అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం అమ్మిన తర్వాత మిల్లులకు వెళ్లాల్సిన అవసరం లేదని ,ఒకవేళ ఎవరైనా రైతులను రైస్ మిల్లులకు పంపిస్తే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. శనివారం రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న ఆర్జాలబావి, ఎస్ఎల్ బీసీ మార్కెట్ యార్డ్ లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత అధికారులతో కలిసి తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాలలోని ధాన్యపు రాశులు, తేమ, తాలు, తరుగు తదితర వివరాలను తెలుసుకోవడమే కాకుండా ధాన్యాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు.అనంతరం రెండు చోట్ల రైతులు, హమాలీలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, అధికారులతో సమావేశాలు నిర్వహించారు. ధాన్యం సేకరణ పాలసీకి విరుద్ధంగా ఎవరు సేకరణ చేయకూడదని, ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని, ఇందుకు సంబంధిత శాఖల అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలులో మిల్లర్ల ప్రమేయం ఉండరాదని, కొనుగోలు కేంద్రంలో రైతు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు మాత్రమే సంబంధం ఉంటుందని, ధాన్యం అమ్మిన వెంటనే రైతుకు పక్కా రశీదు ఇవ్వాలని, అనంతరం రైతు బ్యాంక్ అకౌంట్లో డబ్బులు జమ చేయాలని చెప్పారు. కొనుగోలు కేంద్రం నుండి మిల్లులకు ధాన్యాన్ని పంపించిన తర్వాత మిల్లులకు వెళ్లాల్సిన బాధ్యత అధికారులదేనని, ధాన్యం విషయంలో రైస్ మిల్లర్ల పెత్తనం కుదరదని, గతంలో పద్ధతి చెల్లదని ఆయన స్పష్టం చేశారు.తాలు ,తరుగు ,తేమకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే రైతులు కొనుగోలు కేంద్రంలోనే పరిష్కారం చేసుకోవాలని, మిల్లర్లకు ఏదైనా సమస్య ఉంటే ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం క్వింటాలకు 45 రూపాయలు మాత్రమే హమాలి ఛార్జ్ తీసుకోవాలని, అంతకుమించి ఎక్కువ వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాన్యం సేకరణలో ప్రజాప్రతినిధులు ,అధికారులు రైతులకు ప్రాధాన్యత ఇచ్చి పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు. ఎఫ్ సి ఐ గైడ్ లైన్స్ ప్రకారం రబీ ధాన్యం కొనుగోలు కు సంబంధించి తేమ, తరుగు వంటివి కొనుగోలు కేంద్రం లోనే ముందే చూసుకోవాలని, రైతుల సొంత ఖర్చులతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువసారని, తాలు, తరుగు పేరుతో వారిని ఇబ్బంది పెట్టడం భావ్యం కాదని, శాస్త్రీయంగా మద్దతు ధర వచ్చేలా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కాంటా వేయకముందు తాలూ, తరుగు, తేమ హమాలీ పేరుతో కొనుగోలు కేంద్రాల్లో అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇకపై ఇలాంటివన్నీ ఉండటానికి వీలులేదని, ధాన్యం సేకరణ విధానాల ప్రకారమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ఎవరైనా తేమ,తరుగు, తాలు పేరుతో రైతులను ఇబ్బందులు పెడితే సహించేది లేదని అన్నారు. ఇకపై ఇలాంటి అన్ని ఆపివేయాలని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వం అని, దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతుబంధు, రైతు రుణమాఫీ, ప్రభుత్వం ఇవ్వడం జరిగిందని తెలిపారు.కాగా పలువురు రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో మిల్లర్లు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తరుగు, తాలు, తూకం పేరిట అనవసరంగా మిల్లుల వద్ద లారీలను ఆపుతున్నారని, లారీకి 10 క్వింటాళ్ల చొప్పున తరుగు తీస్తున్నారని ,ప్రభుత్వం రైతుల గురించి ఆలోచించాలని కోరారు. రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న మాట్లాడారు. రైతు సంక్షేమ కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్, నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ ,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి ,మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాంపతి నాయక్, డిఎస్ఓ, తహసీల్దార్ పరశురాం, మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, ఆదర్శ రైతు రామిరెడ్డి, తదితరులు ఉన్నారు.

# అప్పుడు చెల్లని రూపాయి ఇప్పుడెలా చెల్లుతుంది?



**జగిత్యాల,ఫ్లాష్ ఇండియా:** గతంలో జీవన్ రెడ్డిని "చెల్లని రూపాయి"గా విమర్శించిన కేటీఆర్ ఇప్పుడు ఆయనను పార్టీలోకి ఎలా స్వీకరిస్తున్నారో చెప్పాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. అప్పుడు చెల్లని రూపాయి ఇప్పుడు ఎలా చెల్లుతుంది అంటూ విమర్శించారు. శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్, డీసీసీ ప్రెసిడెంట్ నందయ్యతో ప్రెస్ మీట్‌లో మాట్లాడారు. జీవన్ రెడ్డికి మంత్రి పదవి ఇచ్చి ఉంటే పార్టీని వీడేవారేనా? అని మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రశ్నించారు. రాజ్య సభ ఇచ్చినా లేక ప్రభుత్వ సలహాదారు పదవి ఇచ్చినా జీవన్ రెడ్డి పార్టీలోనే ఉండేవారని, పదవులు రాకపోవడంతోనే బీఆర్ఎస్‌లో జాయిన్ అవుతున్నారని అన్నారు. 40 ఏళ్లు పార్టీలో పదవులు అనుభవించిన వ్యక్తి ప్రభుత్వంపై సీఎంపై విమర్శలు చేస్తున్నారని, ఇది రాజకీయ నైతికత కాదన్నారు. ఇకనైనా జీవన్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై అనవసర విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. గతంలో కేసీఆర్, కేటీఆర్‌లను తీవ్రంగా విమర్శించిన జీవన్ రెడ్డి ఇప్పుడు వారినే ప్రశంసించడం విడ్డురంగా ఉందన్నారు.

**మళ్లీ అధికారంలోకి కాంగ్రెస్ రావడం పక్కా..**

మరోవైపు బీఆర్ఎస్ నిర్వహిస్తున్న సభపై కూడా మంత్రి విమర్శలు గుప్పించారు. ఇది నిజంగా బీఆర్ఎస్ బహిరంగ సభనా? లేక జీవన్ రెడ్డి చేరిక సభనా? అన్నది ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్లు అక్రమ సంపాదనతో సభకు జన సమీకరణ చేస్తున్నారని విమర్శలు చేశారు. సభ పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించవద్దని హెచ్చరించారు. సీఎం రేవంత్ పాలనా పోవాలని ప్రజలు మార్పు కోరుకుంటున్నారని జీవన్ రెడ్డి అనడం ఆశ్చర్యంగా ఉందన్నారు. అదే నిజమైతే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కు ఎందుకు పట్టం కట్టారని, ఆ తర్వాత వచ్చిన పార్లమెంట్, సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎందుకు విజయం సాధించిందని ప్రశ్నించారు. ఇక గత ప్రభుత్వం మాదిరి అక్రమ అరెస్టులు, నిర్బంధాలు లేవని, బీఆర్ఎస్ సభ విషయంలో నిబంధనల ప్రకారం అన్ని అనుమతులు ఇవ్వాలని తానే స్వయంగా కలెక్టర్‌కు సూచించినట్టు మంత్రి పేర్కొన్నారు. ప్రజలు ప్రతి ఒక్కటీ గమనిస్తున్నారని నిజమైన రాజకీయ నిబద్ధత, అభివృద్ధి, సంక్షేమం ఎక్కడుందో అర్థం చేసుకుంటారని అన్నారు. ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసిన రాష్ట్రంలో మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

# మంత్రిని కలిసిన కాంగ్రెస్ నేతలు



**నేరడిగొండ,ఫ్లాష్ ఇండియా :** బోథ్ నియోజకవర్గానికి అదనపు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల్ చారితో కలిసి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ కోరారు. బోథ్ నియోజకవర్గ ప్రజల గృహ సమస్యలను పరిష్కరించేందుకు అదనపు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు అవసరమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పేద, అవసరమైన కుటుంబాలు ఇంకా ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నాయని, వారికి గృహ వసతి కల్పించడం అత్యవసరమని మంత్రికి వివరించారు.ముఖ్యంగా అర్హులైన లబ్ధిదారులకు అదనపు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. బోథ్ నియోజకవర్గానికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, మాజీ బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరసింహదాస్, మాజీ ప్యాక్స్ డైరెక్టర్ చట్ల ఉమేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, యువ నాయకుడు అలపాటి అచ్యుతానంద రెడ్డి, యండి సద్దాం, హీరా సింగ్, రాహిల్ తదితరులు పాల్గొన్నారు.

# భూమి ఉన్నంతకాలం భూదాన్ పోచంపల్లి పేరు శాశ్వతం

**భూదాన్ పోచంపల్లి,ఫ్లాష్ ఇండియా:** సమాజంలో సామాజిక న్యాయం, సమానత్వం సాధించడమే లక్ష్యంగా సాగిన భూదాన ఉద్యమానికి నాంది పలికిన భూదాన్ పోచంపల్లి గడ్డ భూమి ఉన్నంతవరకు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. శనివారం భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో తెలంగాణ సర్వోదయమండలి, వెదిరే రామచంద్రారెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో భూదాన ఉద్యమానికి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా భూదానోద్యమం వజ్రోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చౌటుప్పల్ చౌరస్తాలో ప్రథమ భూదాత వేదిరే రామచంద్రారెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16న శివరాంపల్లి నుండి ప్రారంభమైన సర్వోదయ పాదయాత్ర నేడు పోచంపల్లికి చేరుకుందన్నారు. రజాకారుల కాలంలో హింస మార్గంలో ప్రజలను చంపి భూమి గుంజుకుంటున్న సమయంలో అహింసా మార్గంలో 44 లక్షల ఎకరాల భూమిని సేకరించి పంచిపెట్టడం గొప్ప విషయమన్నారు. సర్వోదయ ఉద్యమంలో వెదిరే రామచంద్రారెడ్డి పాత్ర కీలకమని, ప్రపంచవ్యాప్తంగా పోచంపల్లికి గుర్తింపు ఉందన్నారు. అనంతరం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ భూదానోద్యమ స్ఫూర్తితోనే అప్పట్లో ఇందిరాగాంధీ సీలింగ్ యాక్ట్ తెచ్చారని, అప్పటి ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు సమర్థవంతంగా అమలు చేశారని గుర్తు చేశారు. పేదలకు భూమిని దానం చేయడం అనేది గొప్ప విషయమని ,అంతటి మహనీయుడి ఆవిష్కరణలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. పోచంపల్లికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని గతంలో ఇక్కడి నుండి నాగపూర్ వరకు సుమారు 500 కిలోమీటర్ల పైచిలుకు సర్వోదయ పాదయాత్ర చేపట్టామన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భూమిలేని నిరుపేదలు పడుతున్న బాధలను చూసి చలించిపోయిన వినోబాభావే ప్రారంభించిన భూదానోద్యమం తోనే భూదాన్ పోచంపల్లిగా పేరుందిందని ఆయన చేసిన సేవలను కొనియాడారు. అఖిలభారత సర్వోదయ మండలి అధ్యక్షులు, వెదిరే రామచంద్రారెడ్డి మనవడు వేదిరే అరవింద్ రెడ్డి మాట్లాడుతూ 1951 ఏప్రిల్ 15న వినోబాభావే పోచంపల్లికి వచ్చినప్పుడు హరిజనవాడ ప్రజలు బతుకుతెరువు కోసం 40 కుటుంబాలకు గాను 80 ఎకరాలు కోరగా వెదిరే రామచంద్ర రెడ్డి ఏకంగా 100 ఎకరాలను దానం ఇచ్చి గొప్ప మనసు చాటుకున్నాడు. ఈ సంఘటన దేశ చరిత్రనే మార్చేసిందని, అందుకే బీహార్ రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో వెదిరే రామచంద్రారెడ్డి ఫోటో ఉంటుందని తెలిపారు. అనంతరం పలువురికి సన్మాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షులు తలుపునూరి కృష్ణ గౌడ్, అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, వెదిరే రామచంద్రారెడ్డి సేవాసమితి అధ్యక్షులు పోతగల దానయ్య, ఉపాధ్యక్షులు కొమ్ము లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి కరగల్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడలో 'అరైవ్ అలైవ్'




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని స్థానిక ఏఆర్సి ఫంక్షన్ హాల్‌లో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజు 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రజలకు రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరిస్తేనే రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు.

**జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ:**

హెల్మెట్ ధరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే ప్రమాదాల్లో ప్రాణ నష్టం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరించారు.గత ఏడాది జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో సుమారు 350 మంది మృతి చెందగా వారిలో 90 శాతం మంది హెల్మెట్ ధరించని వారేనని తెలిపారు.అవగాహన కార్యక్రమాల అనంతరం హెల్మెట్ లేనివారిపై జరిమానాలు విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.గత ఏడాది మిర్యాలగూడ డివిజన్‌లో 93 మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు అలాగే ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగితే తక్షణమే 100 లేదా 108 కు సమాచారం ఇవ్వాలని సూచించారు రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే మొదటి గంటను 'గోల్డెన్ అవర్' అని పిలుస్తారని ఈ సమయంలో బాధితులకు తక్షణ వైద్యసేవలు అందితే ప్రాణాలను కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు.ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను సమీప ఆసుపత్రికి తరలించడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు.రోడ్డు ప్రమాద బాధితులను ఆసుపత్రికి తరలించిన వారికి రహవీర్ పథకం ద్వారా మొదటిసారి రూ 25000 రెండోసారి రూ 50,000 మూడోసారి రూ 1 లక్ష వరకు పరిహారం అందిస్తారని తెలిపారు. ఇటీవల జిల్లాలో వెంకన్నకు రూ 25 వేల పరిహారం అందిన విషయాన్ని కూడా వెల్లడించారు. రోడ్డు ప్రమాద బాధితులను ఆసుపత్రికి తరలిస్తే పోలీసులతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని స్పష్టం చేశారు. జరిమానా విధించడం కంటే హెల్మెట్ ఉంటేనే వాహనం ఇవ్వాలి: ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతున్నందున ట్రాఫిక్ సిబ్బంది సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందన్నారు.రోడ్డు ప్రమాదాల్లో బాధితులకు సహాయం అందించడంలో పోలీస్ కేసులు అవుతాయని భయపడుతున్న ప్రజలకు ప్రభుత్వం భరోసా కల్పించాలని సూచించారు. మిర్యాలగూడ పట్టణంలోని హైవేల వెంట ఉన్న మద్యం దుకాణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నందున వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే మిర్యాలగూడలో ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.హెల్మెట్ లేనివారికి జరిమానాలు విధించడం కంటే హెల్మెట్ కొనుక్కొని వస్తేనే వాహనం ఇవ్వాలని ప్రజల్లో చైతన్యం తీసుకురావడం అవసరమని అభిప్రాయపడ్డారు.రోడ్డు ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు అలాగే ప్రమాదంలో గాయపడిన వారికి ఇవ్వవలసిన ప్రథమ చికిత్స (First Aid) విధానాలను ప్రదర్శన ద్వారా చూపించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం రోడ్డు భద్రతా నిబంధనలు పాటించే విధంగా ప్రతిజ్ఞ చేయించారు. బిఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో 4 వ రోజు నిర్వహిస్తున్న ఉచిత పెరుగు అన్నం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజ,వన్ టౌన్ సీఐ నాగభూషణం రావు,టూ టౌన్ సీఐ సోమనరసయ్య,రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, ఆర్టిఏ చంద్రశేఖర్ గౌడ్ ఆర్టీసీ డిఎం రామ్మోహన్ రెడ్డి,ఎస్సైలు సైదిరెడ్డి,బిక్షమయ్య,రాంబాబు, లక్ష్మయ్య,శ్రీనివాస్,మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరు సుధాబాలకృష్ణ,వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీష నవీన్, వైద్యాధికారులు,డ్రైవర్లు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# త్రాగునీటి సమస్యను పరిష్కరించండి సారు...



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మిర్యాలగూడ గాంధీనగర్ 34,35 వ వార్డు ప్రజలకు మిషన్ భగీరథ నీటి సరఫరా ద్వారా వస్తున్న, మంచినీరు దుర్వాసనతో,పచ్చని రంగుతో వస్తున్నదని, పేద,మధ్యతరగతి ప్రజలమైన మాకు,ఈ నీటిని త్రాగునీటిగా వాడుతున్న కారణంగా,ఇటువంటి నీరు త్రాగడం వలన అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున, ప్రజారోగ్య దృష్ట్యా తక్షణమే ఇట్టి విషయమై తగు విచారణ జరిపి, ఫిల్టర్ చేయబడిన నీరు ప్రజలకు అందేలా, తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ అందుబాటులో లేనందున మున్సిపల్ డి ఈ కి విజ్ఞాపన పత్రం అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా, అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షులు, దైద.శ్రీనివాస్ మాట్లాడుతూ త్రాగునీరుకి ఉపయోగించే మిషన్ భగీరథ నీరు,కలుషితంగా రావడం అనేది ప్రజల ఆరోగ్యాలకు మంచిది కానందున, మున్సిపల్ కమిషనర్ ని ఫిల్టర్ అయిన నీటిని అందజేయవలసిందిగా,కోరుతూ ఈరోజు విజ్ఞాపన పత్రం అందజేయడం జరిగినది. దీనిపై మున్సిపల్ డి ఈ స్పందించి "తక్షణమే ఈ సమస్యను పరిష్కరిస్తామని... హామీ ఇవ్వడం జరిగినది." ఇట్టి కార్యక్రమంలో ఉబ్బపల్లి శంకర్, దైద సాయినాథ్, కలకొండ చంద్రమౌళి, దైద శ్రీకాంత్, చిలుముల వెంకటేష్, ఎల్తురి అఖిల్, దైద పవన్ తదితరులు పాల్గొన్నారు....

# సమస్యల పరిష్కారానికి మీ వద్దకే వస్తా

**ధర్మారం,ఫ్లాష్ ఇండియా:** ధర్మారం మండలంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పర్యటించారు. ధర్మారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్లో రూ. కోటి 74 లక్షలతో చేపట్టన అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. మల్లాపూర్ గ్రామంతో పాటు ధర్మారం వ్యవసాయ మార్కెట్లో రెండు చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో 23 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులను, ఒకరికి షాదీ ముబారక్ చెక్కుతో పాటు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పెద్దపల్లి జిల్లా కలెక్టర్ తో కలిసి మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మారం మండలంలోని అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ధర్మారం మండలంలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు ఇవ్వడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు. ధర్మారం ప్రాంతంలోని విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలని లక్ష్యంతో ధర్మారం మండలం ఎర్రగుంటపల్లి లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు.

**75శాతం ట్రైబల్ విద్యార్థులకు కేటాయిస్తాం..**

ధర్మారం మండల కేంద్రంలోని ఎస్టీ మినీ గురుకుల పాఠశాలను పదవ తరగతి వరకు అప్ గ్రేడ్ చేశామని పదో తరగతి వరకు మినీ గురుకుల పాఠశాలలో సీట్లు 25 శాతం ఇతర వర్గాలకు 75శాతం ట్రైబల్ విద్యార్థులకు కేటాయిస్తామని మంత్రి వివరించారు. ధర్మారం మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని యువత వివిధ రకాల క్రీడల్లో రాణించడానికి మిని స్టేడియం ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు. పార్టీలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు. గ్రామ సమస్యలపై ప్రజలు ఎవరు తన కోరకు హైదరాబాద్ వంటి ప్రాంతాలకు రావద్దని వారంలో మూడు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.


**ప్రజా ప్రభుత్వంలో రైతులకు రాయితీ ద్వారా**

మండలంలో మొక్కజొన్న సాగుచేసిన రైతులు ఏలాంటి ఆందోళన చెందవద్దని ఇప్పటికే జగిత్యాల జిల్లాలో ప్రభుత్వం తరఫున ఆరు మక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని అవసరమైన పక్షంలో ధర్మారం మండల కేంద్రంలో మక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ కాలంలో రైతులను ఏనాడు పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి నాయకత్వం ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో రైతులకు రాయితీ ద్వారా పనిముట్లను పంపిణీ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా ధర్మారం మండలంలోని 61 మంది రైతులకు రూ.18.24 లక్షల విలువైన వ్యవసాయ పరికరాలను ఈ సందర్భంగా మంత్రి అందజేశారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రుప్లా నాయక్, వైస్ చైర్మన్ అరిగే లింగయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు రంజిత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మండల సర్పంచులు, కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


# సమయపాలన పాటించని పల్లె ధవాఖాన..!

**కుబీర్,ఫ్లాష్ ఇండియా :** మండలంలోని పార్డి బీ గ్రామంలోని పల్లె దవాఖాన శనివారం (ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్) సమయం దాటినా తాళం తెరుచుకోలేదు. సమయపాలన పాటించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పనిచేయాలి. సమయపాలన పాటించడం లేదన్న విమర్శలున్నాయి. ఒకపక్క పెరిగిన ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న నిరుపేదలకు సలహాలు సూచనలతో పాటు వైద్య సేవలు




అందించాలి. ప్రైమరి హెల్త్ ప్రొవైడర్ అందుబాటులో లేకపోవడతో ఆర్ఎంపీలను ఆశ్రయించాల్సి వస్తుందని నిరుపేదలు అంటున్నారు. సంబంధిత శాఖ జిల్లా అధికారులు నిరుపేదలకు మెరుగైన వైద్యం అందాల చూడాలని స్థానికులు అంటున్నారు.

# డేవిడ్ పేన్ స్థానంలో ఎంట్రీ



ఐపీఎల్ 2026 సీజన్‌ను గాయాల బెడద వెంటాడుతోంది. ఇప్పటికే పదుల సంఖ్యలో ప్లేయర్లు జట్లకు దూరం అయ్యారు. దీంతో అయా జట్లు వారి స్థానంలో కొత్త వారిని రిప్లేస్ చేసుకుంటున్నాయి. ఈ గాయాల బెడద సన్ రైజర్స్ జట్టుపై కూడా పడింది. గాయంతో టోర్నీకి దూరమైన ఇంగ్లాండ్ ఎడమచేతి వాటం పేసర్ డేవిడ్ పేన్ స్థానంలో సౌతాఫ్రికా ఫాస్ట్ బౌలర్ అయిన గెరాల్డ్ కోయెట్జీని ఎంపిక చేసుకుంది. డేవిడ్ పేన్ తన చీలమండ గాయం కారణంగా ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఆయన ఈ సీజన్‌లో 2 మ్యాచ్‌లు ఆడి 2 వికెట్లు తీశారు. కోయెట్జీని రూ. 2 కోట్లకు సన్‌రైజర్స్ ఒప్పందం చేసుకుంది. 24 ఏళ్ల ఈ కుడిచేతి వాటం ఫాస్ట్ బౌలర్ దక్షిణాఫ్రికా తరపున 18 టీ20 ఇంటర్నేషనల్స్ ఆడి 22 వికెట్లు తీశాడు. గతంలో ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిధ్యం వహించిన అనుభవం అతనికి ఉంది. ఒకవైపు కోయెట్జీ రాకతో పాటు, సన్‌రైజర్స్ కెప్టెన్ పాట్ కమిన్స్ కూడా తిరిగి జట్టుతో చేరడం అభిమానులకు శుభవార్త. ఆయన ఏప్రిల్ 25న రాజస్థాన్ రాయల్స్‌తో జరిగే మ్యాచ్‌లో అందుబాటులో ఉండే అవకాశం ఉంది. కోయెట్జీ తన వేగం, దూకుడుతో సన్‌రైజర్స్ బౌలింగ్ విభాగానికి కొత్త ఊపును ఇస్తాడని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో ఉన్న ఎస్‌ఆర్‌హెచ్, ఈరోజు (ఏప్రిల్ 18) చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడనుంది.

# ఉప్పల్ మైదానంలో ఆసక్తికర పోరు..



ఐపీఎల్ 2026లో నేడు ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. ఉప్పల్ మైదానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్), చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) అమీతుమీ తేల్చుకోనున్నాయి. మిడ్ టేబుల్‌లో ఉన్న ఈ రెండు జట్లు తమ తమ స్థానాలను మెరుగుపరుచుకోవడానికి ఈ మ్యాచ్‌లో విజయంను అత్యంత కీలకంగా భావిస్తున్నాయి. ఎస్‌ఆర్‌హెచ్ ఇప్పటివరకు ఆడిన 5 మ్యాచ్‌లలో రెండు గెలవగా.. సీఎస్‌కే కూడా రెండు విజయాలు అందుకుంది. అయితే ఎస్‌ఆర్‌హెచ్, సీఎస్‌కే మ్యాచ్ నేపథ్యంలో అభిమానుల దృష్టి మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఉప్పల్ స్టేడియంలో దిగుతాడా?, వాతావరణ పరిస్థితుల కారణంగా మ్యాచ్ సజావుగా సాగేనా? అనే వాటిపై ఉన్నాయి. గాయం కారణంగా ఐపీఎల్ 2026లో ఎంఎస్ ధోనీ ఇప్పటివరకు ఆడలేదు. సీఎస్‌కే తొలి 5 మ్యాచ్‌ల్లో ఆడని మహీ.. ఈ మ్యాచ్‌లో అయినా ఆడతాడా లేదా అన్నది ఆసక్తిగా ఉంది. రెండు రోజుల క్రితమే హైదరాబాద్‌కు చేరుకున్న ధోనీ.. ఉప్పల్ మైదానంలో ప్రాక్టీస్ కూడా చేశాడు. మహీ రాకతో మ్యాచ్ టిక్కెట్లు హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. ధోనీ ప్రాక్టీస్ చూస్తే మాత్రం ఈరోజు ఆడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎస్‌ఆర్‌హెచ్ మ్యాచ్ ధోనీ ఆడేది లేనిది మరికొద్ది గంటల్లో తేలిపోనుంది. రెండు వరుస విజయాలతో ఫామ్‌లోకి వచ్చిన చెన్నై.. సన్‌రైజర్స్‌ను ఓడించి హ్యాట్రిక్ కొట్టాలని చూస్తోంది. హైదరాబాద్ వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించే అవకాశాలు చాలా తక్కువ. కొన్ని ప్రాంతాల్లో మేఘావృతం ఉన్నప్పటికీ.. మ్యాచ్ జరుగుతున్న సమయంలో ఆకాశం నిర్మలంగా ఉండే అవకాశం ఉంది. ఏప్రిల్‌లో అప్పుడప్పుడు వచ్చే సమ్మర్ షవర్స్ ఈ మ్యాచ్‌ను ప్రభావితం చేసే అవకాశాలు లేవు. మ్యాచ్ సమయంలో తేమ సుమారు 45 శాతం వరకు ఉండే అవకాశం ఉంది. దీనివల్ల రెండో ఇన్నింగ్స్‌లో డ్యూ ప్రభావం ఉంటుంది. ఈ పరిస్థితుల్లో బౌలర్లకు, ముఖ్యంగా స్పిన్నర్లకు బంతిని పట్టుకోవడం కష్టమవుతుంది. అందుకే టాస్ గెలిచిన జట్టు ముందుగా బౌలింగ్ ఎంచుకోనుంది. మధ్యాహ్నం సమయంలో హైదరాబాద్‌లో తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గరిష్టంగా 40 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు చేరుతుండగా.. మ్యాచ్ ప్రారంభానికి సమయానికి 27 డిగ్రీలకు తగ్గే అవకాశం ఉంది. అయినప్పటికీ పగటి వేడి ప్రభావం ఆటగాళ్ల శారీరక సామర్థ్యాన్ని పరీక్షించనుంది. ఉప్పల్ పిచ్ సాధారణంగా బ్యాట్స్‌మెన్‌కు అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుతం ఉన్న ఎండల కారణంగా పిచ్ వేగంగా, బౌన్స్ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. దీంతో హై స్కోరింగ్ మ్యాచ్ కావచ్చని అంచనా వేస్తున్నారు.



## తొలి ప్లేయర్‌గా రికార్డ్

ఐపీఎల్ 2026లో భాగంగా నిన్న(శుక్రవారం) జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ చేతిలో 5 వికెట్ల తేడాతో కోల్‌కతా నైట్ రైడర్స్ ఓటమి పాలైంది. దీంతో ఐదు ఓటములను కేకేఆర్ తన ఖాతాలో వేసుకోవడమే కాకుండా ప్లే ఆఫ్ ఆశలు సంక్లిష్టంగా మారాయి. ఇక నిన్నటి మ్యాచ్ ఓటమిలోనూ ఆ జట్టు మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి చరిత్ర సృష్టించాడు. తన ఫ్రాంచైజీ చరిత్రలో 100 వికెట్లు తీసిన తొలి భారతీయుడిగా చారిత్రక ఘనత సాధించాడు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తి 2 వికెట్లు సాధించాడు. అందులో తొలి వికెట్ తీసిన క్రమంలోనే 100 వికెట్ల ఘనత అందుకున్నాడు. 9.1 ఓవర్లో తీసిన జోస్ బట్లర్ వికెట్ వరుణ్‌కు ఐపీఎల్‌లో 100వ వికెట్. వరుణ్ కంటే ముందు కేకేఆర్ తరపున 100 వికెట్లు తీసిన బౌలర్లుగా సునీల్ నరైన్ (214), ఆండ్రీ రసెల్ (124) ఉన్నారు. వీరిద్దరూ విదేశీ ప్లేయర్ల కాగా వరుణ్ చక్రవర్తి తొలి ఇండియన్ ప్లేయర్ కావడం గమనార్హం. వరుణ్ తన ఐపీఎల్ కెరీర్‌లో (పంజాబ్, కేకేఆర్ తరఫున) ఇప్పటివరకు 87 మ్యాచ్‌లు ఆడి102 వికెట్లు తీశాడు. ఇందులో 2019లో తన తొలి సీజన్‌లో పంజాబ్ కింగ్స్ తరఫున తీసిన ఒక వికెట్ కూడా ఉంది. వరుణ్ ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో పంజాబ్ పేసర్ అర్షదీప్ సింగ్‌తో కలిసి సంయుక్తంగా 28వ స్థానంలో ఉన్నాడు. ఇక కేకేఆర్ తరఫున 196 వికెట్లతో నరైన్ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు, ఇది ఐపీఎల్ చరిత్రలో ఒకే ఫ్రాంచైజీకి అత్యధిక వికెట్ల రికార్డు కూడా ఇదే కావడం గమనార్హం. మొత్తంగా గుజరాత్ మ్యాచ్ లో వరుణ్ చారిత్రాత్మక రికార్డును నమోదు చేసినా.. కేకేఆర్ ఓడిపోవడంతో అది మరుగునపడిపోయింది.

# డబుల్ రేట్స్, అయినా ఎక్కడా దొరకని టికెట్స్..



ఐపీఎల్ 2026లో భాగంగా ఈరోజు సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్), చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) మధ్య కీలక మ్యాచ్ జరగనుంది. ఉప్పల్ స్టేడియంలో రాత్రి 7.30కు మ్యాచ్ ఆరంభం కానుంది. ఈ మ్యాచ్ కోసం హైదరాబాద్ ఫాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే మ్యాచ్ నేపథ్యంలో టికెట్ల వ్యవహారం మరోసారి తీవ్ర వివాదానికి దారితీసింది. మ్యాచ్‌పై భారీ క్రేజ్ ఉండటంతో అభిమానులు టికెట్లు కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ.. అందుబాటులో లేకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టికెట్ ధరలను భారీగా పెంచడం కూడా అభిమానుల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. ఉప్పల్ స్టేడియంలో సౌత్ ఈస్ట్, వెస్ట్ టెర్రస్ టికెట్ల ధరలను రూ.1250 నుంచి రూ.2500కు పెంచారు. ఈస్ట్, వెస్ట్ ఫస్ట్ ఫ్లోర్ టికెట్ల ధరలను రూ.2250 నుంచి రూ.3500కు పెంచారు. ఇక కార్పొరేట్ బాక్స్ టికెట్ల ధరలను రూ.23,000 నుంచి ఏకంగా రూ.33,000కు పెంచడం విమర్శలకు దారితీసింది. బుకింగ్ చార్జీలు కూడా రూ.300 నుంచి రూ.2000 వరకు పెరగడం అభిమానులను మరింత అసహనానికి గురి చేస్తోంది. టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేసిన క్షణాల్లో అమ్ముడైపోతున్నాయి. డిస్ట్రిక్ట్ యాప్‌లో సరైన విధంగా అందుబాటులో ఉంచడం లేదని అభిమానులు ఆరోపిస్తున్నారు. ఎస్‌ఆర్‌హెచ్, సీఎస్‌కే టికెట్లను ఉద్దేశపూర్వకంగా బ్లాక్ చేసి.. బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారన్న అనుమానాలు కూడా అభిమానుల్లో వ్యక్తమవుతున్నాయి. ఆశ్చర్యకరంగా బ్లాక్ మార్కెట్‌లో కూడా టికెట్లు దొరకడం లేదని కొందరు ఫాన్స్ అంటున్నారు. మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ హైదరాబాద్‌కు చేరుకోవడంతో ఈ మ్యాచ్‌పై క్రేజ్ మరింత పెరిగింది. ధోనీని ప్రత్యక్షంగా చూడాలనే ఆశతో ఇతర రాష్ట్రాల నుంచి కూడా అభిమానులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు చేరుకున్నారు. టికెట్లు దొరకకపోవడంతో వారు నిరాశ చెందుతున్నారు. టికెట్లను పెద్ద మొత్తంలో చెన్నైకి తరలించారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఎస్‌ఆర్‌హెచ్ మేనేజ్‌మెంట్‌పై అభిమానులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బ్లాక్ మార్కెట్‌లో టికెట్స్ అమ్ముకుని ఎస్‌ఆర్‌హెచ్ యాజమాన్యం సొమ్ము చేసుకుంటోందా? అని ఫాన్స్ ఫైర్ అవుతున్నారు.

# గ్రీన్ బ్యాటింగ్‌తో కంగారు పడ్డా..



శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని గుజరాత్ టైటాన్స్ జట్టు ఐపీఎల్ 2026లో మరో విజయంను ఖాతాలో వేసుకుంది. శుక్రవారం కోల్‌కతా నైట్ రైడర్స్‌ను గుజరాత్ మట్టికరిపించింది. గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్ (86; 50 బంతుల్లో 8×4, 4×6) ఆడగా.. కాగిసో రబాడ (3/29), మహమ్మద్ సిరాజ్ (2/23) అద్భుతమైన స్పెల్‌తో గుజరాత్ విజయంలో కీలక పాత్ర పోషించారు. మ్యాచ్ అనంతరం గిల్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్న గిల్.. తన ఆట కంటే జట్టు గెలుపే ముఖ్యమని స్పష్టం చేశాడు. ఫైనల్ ఆడి కప్ గెలవడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నాడు. కామెరాన్ గ్రీన్ (79; 55 బంతుల్లో 7×4, 4×6) బ్యాటింగ్‌తో కంగారు పడ్డానని గిల్ చెప్పుకొచ్చాడు. 'నిజం చెప్పాలంటే నేను 2023లా బ్యాటింగ్ చేస్తున్నానా లేదా అనేది అంత ముఖ్యం కాదు. జట్టు గెలుపు నాకు ముఖ్యం. ఈసారి ఫైనల్ ఆడి కప్ గెలవడమే నా టార్గెట్. మేము ఇంకో ఓవర్ లేదా రెండు ఓవర్ల ముందుగానే మ్యాచ్ ముగించాలని అనుకున్నాం. నేను ఔటైన విధానంతో కాస్త నిరాశ చెందాను. చివరి వరకు ఉండి మ్యాచ్‌ను ఫినిష్ చేయాలనుకున్నాను. వచ్చే మ్యాచులలో తప్పక చివరి వరకు క్రీజులో ఉంటా. సిరాజ్, రబడాలు బాగా బౌలింగ్ చేశారు. వాళ్లు బౌలింగ్ చేస్తున్న తీరు చూస్తే ప్రతి బంతికి వికెట్ వచ్చేలా అనిపించింది. చివర్లో కూడా వారికి ఇంకో ఓవర్ ఇవ్వాలని అనిపించింది. బంతి కొంచెం స్వింగ్ అవుతూ ఉంది. కాబట్టి ఇంకా ఒక ఓవర్ బౌలింగ్ చేయగలరా? అని అడిగాను. ఇద్దరితో వరుసగా మూడు ఓవర్లు వేయించా. ఈ వేడిలో వరుసగా మూడు ఓవర్లు వేయడం అంత సులభం కాదు. అని గిల్ చెప్పాడు. గ్రీన్ బ్యాటింగ్‌తో కంగారు పడ్డా. మధ్య ఓవర్లలో కోల్‌కతా మ్యాచ్‌ను మా చేతుల నుంచి లాక్కుంది. అయినప్పటికీ వికెట్లు తీసే ప్రయత్నం చేశాం. కేకేఆర్ బ్యాటింగ్ లైనప్ చాలా లోతుగా ఉంది. సునీల్ కూడా నంబర్ 9లో వచ్చాడు. ప్రతి బంతిని బౌండరీకి పంపాలని చూస్తారని మాకు తెలుసు. అందుకే అటాకింగ్ ఆప్షన్‌తో వికెట్లు తీసే దిశగా ఆలోచించాము. ఫలితం దక్కింది. నా బ్యాటింగ్ పట్ల సంతోషంగా ఉన్నా. ఈ సీజన్‌కు ముందు కొన్ని నెలల సమయం దొరికింది. ఆ సమయంలో ఫిట్‌నెస్‌పై ఎక్కువగా పని చేశాను. అలాగే మానసికంగా కూడా మెరుగుపడేందుకు ప్రయత్నించాను. టెక్నికల్‌గా మాత్రమే కాకుండా టాక్టికల్‌గా కూడా నా ఆటను అభివృద్ధి చేసుకోవాలని చూశాను. భవిష్యత్తు గురించి ఆలోచించకుండా.. ప్రస్తుత క్షణంలో ఉండటం చాలా ముఖ్యం. ఓటముల నుంచి నేర్చుకోవాలి కానీ అందులోనే ఉండిపోకూడదు' అని గిల్ పేర్కొన్నాడు.

# బిజినెస్



# తగ్గుతున్న గ్యాస్ రేట్లు!

అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు, సహజ వాయువు ధరలు ఒక్కసారిగా పడిపోవడంతో ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులకు ఊరట లభించే సూచనలు కనిపిస్తున్నాయి.. హార్మూజ్ జలసంధి విషయంలో కీలక పరిణామాలు చోటుచేసుకోవడంతో మార్కెట్లలో భారీ మార్పులు నమోదయ్యాయి.

ఇరాన్ ప్రభుత్వం కాల్పుల విరమణ అమల్లో ఉన్నంతకాలం హార్మూజ్ జలసంధి గుండా వాణిజ్య నౌకలకు అనుమతి ఇస్తామని ప్రకటించడంతో చమురు ధరలు ఒక్కసారిగా క్షీణించాయి. ఇప్పటివరకు బ్యారెల్‌కు 100 డాలర్లకు పైగా ఉన్న ముడి చమురు ధరలు ఒక్కసారిగా 86 డాలర్ల వరకు దిగివచ్చాయి. అనంతరం కొంత కోలుకుని 90 డాలర్లకు చేరుకున్నాయి.

**చమురు ధరల్లో భారీ పతనం**

అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ బ్యారెల్‌కు 10.48 శాతం తగ్గి 88.97 డాలర్లకు చేరింది. సెషన్ మధ్యలో ఇది 86.09 డాలర్ల కనిష్ట స్థాయిని తాకింది. అలాగే WTI క్రూడ్ ఫ్యూచర్స్ కూడా 12.12 శాతం పడిపోయి 83.21 డాలర్లకు చేరింది. ఇది ఇటీవల కాలంలో ఒక్కరోజులో నమోదైన అతిపెద్ద పతనంగా చెబుతున్నారు.

**గ్యాస్ ధరలు కూడా తగ్గుముఖం**

చమురు ధరలతో పాటు సహజ వాయువు ధరలు కూడా తగ్గాయి. ఎల్ఎన్‌జీ ధరలు 2.624 డాలర్ల వరకు దిగివచ్చాయి. అయితే తర్వాత కొంత పెరిగి 2.674 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి. మొత్తంగా గ్యాస్ మార్కెట్‌లో కూడా ఒత్తిడి కనిపించింది.

**హార్మూజ్ జలసంధిపై మళ్లీ అనిశ్చితి**

ఇక శనివారం ఉదయం Mohammad Bagher Ghalibaf హార్మూజ్ జలసంధిని అమెరికా ఆదేశాల ప్రకారం కాకుండా, ఇరాన్ నిబంధనల ప్రకారమే నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అమెరికా ఆంక్షలు కొనసాగితే జలసంధిని మూసివేసే అవకాశం ఉందని హెచ్చరించారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను కూడా ఆయన విమర్శించారు.

ఈ తాజా పరిణామాలతో సోమవారం నుంచి చమురు ధరలు మళ్లీ పెరిగే అవకాశముందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు.

**స్టాక్ మార్కెట్లపై ప్రభావం**

హార్మూజ్ జలసంధి తెరుచుకుంటుందనే వార్తలతో అమెరికా మార్కెట్లు 2 శాతం పైగా లాభపడ్డాయి. అదే సమయంలో భారత మార్కెట్ సూచిక అయిన గిఫ్ట్ నిఫ్టీ కూడా బలమైన సంకేతాలు ఇస్తోంది. సోమవారం భారత మార్కెట్‌లో సుమారు 300 పాయింట్ల గ్యాప్-అప్‌తో
ప్రారంభమయ్యే అవకాశముందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. చమురు ధరలు తగ్గితే భారత్ వంటి దిగుమతి దేశాలకు ఊరట లభిస్తుంది. ఇంధన ధరలపై కూడా దీని ప్రభావం కనిపించే అవకాశం ఉంది.

# నెట్‌ఫ్లిక్స్‌లో ముగిసిన 'రీడ్ హేస్టింగ్స్' శకం



ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి వినోదాన్ని చేరువ చేసిన నెట్‌ఫ్లిక్స్ సహ వ్యవస్థాపకుడు రీడ్ హేస్టింగ్స్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. వచ్చే నెలతో ఛైర్మన్‌గా ఆయన పదవీకాలం ముగియనుండగా, ఆ తర్వాత కంపెనీ డైరెక్టర్ల బోర్డు నుంచి కూడా ఆయన తప్పుకోనున్నట్లు సంస్థ అధికారికంగా వెల్లడించింది. దాదాపు రెండు దశాబ్దాల పాటు నెట్‌ఫ్లిక్స్‌ను అగ్రపథంలో నడిపిన హేస్టింగ్స్, ఇకపై ప్రజా సంక్షేమం కోసం పని చేయాలని భావిస్తున్నారు. 2023లోనే ఆయన సీఈఓ పదవికి రాజీనామా చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇప్పుడు బోర్డు నుంచి కూడా తప్పుకోవడంతో ఆయన తదుపరి అడుగు సామాజిక సేవా కార్యక్రమాల వైపు ఉండబోతోందని తెలుస్తోంది. అయితే ఆయన చేపట్టబోయే కొత్త ప్రాజెక్ట్ ఏంటనేది ప్రస్తుతానికి సస్పెన్స్‌గా ఉంది.

**1997లో చిన్న అడుగు..**

1997లో తన స్నేహితుడు మార్క్ రాండోల్ఫ్‌తో కలిసి హేస్టింగ్స్ నెట్‌ఫ్లిక్స్‌ను ప్రారంభించారు. మొదట్లో డీవీడీ రెంట్ సర్వీస్‌గా మొదలైన ఈ సంస్థ.. నేడు 190కి పైగా దేశాల్లో స్ట్రీమింగ్ సేవలను అందిస్తోంది. "వినియోగదారుల సంతోషంపై దృష్టి పెట్టడం, ప్రతిభావంతులు ఎదిగేలా ఒక సంస్కృతిని నిర్మించడమే నెట్‌ఫ్లిక్స్‌కు నేను అందించిన నిజమైన సహకారం" అని హేస్టింగ్స్ ఈ సందర్భంగా భావోద్వేగంగా చెప్పుకొచ్చారు. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది సబ్‌స్క్రైబర్లను కలిగి ఉంది. భారతదేశంలో కూడా దీనికి భారీ క్రేజ్ ఉంది. మన దేశంలో ప్రకటనలతో కూడిన బేసిక్ ప్లాన్ రూ. 199 కే అందుబాటులో ఉంది. వెబ్ సిరీస్‌లు, ఒరిజినల్ మూవీస్, డాక్యుమెంటరీలతో నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ రంగంలో రారాజుగా వెలుగొందుతోంది. కేబుల్ టీవీ లేదా శాటిలైట్ కనెక్షన్ అవసరం లేకుండా, నేరుగా ఇంటర్నెట్ ద్వారా స్మార్ట్‌ఫోన్‌లు, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్‌లలో వీడియో కంటెంట్‌ను చూసే సదుపాయాన్ని ఓటీటీ అంటారు. నెట్‌ఫ్లిక్స్‌తో పాటు అమెజాన్ ప్రైమ్ వీడియో, జియో హాట్‌స్టార్, జీ5 వంటివి ఈ రంగంలో ప్రధాన పోటీదారులుగా ఉన్నాయి.

# ఈ రోజు గ్యాస్ సిలిండర్ ధరలు



గ్యాస్ సిలిండర్ ధరలు ప్రతి నెల ఒకటో తేదీన సవరిస్తుంటారు. అయితే, ఇటీవల చమురు మార్కెటింగ్ కంపెనీలు దేశీయ వంట గ్యాస్(LPG) సిలిండర్ ధరలు పెంచిన విషయం తెలిసిందే. ఈ పెంపుతో హైదరాబాద్‌లో 14.2 కిలోల సిలిండర్ ధర రూ. 965.00కు చేరుకుంది. ఈ క్రమంలో ఇటీవల పెరిగిన ధరలు ఏప్రిల్ 1వ తేదీ నుంచైన తగ్గుతాయెమో అని వినియోగదారులు ఆశపడ్డారు. కానీ వారికి నిరాశే మిగిలింది. ఈ నెల ఒకటో తేదీన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరల్ని పెంచగా.. గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధరలు స్థిరంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ఈ రోజు(శనివారం) గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.

ఏప్రిల్ 18వ తేదీన గ్యాస్ సిలిండర్ ధరలు

హైదరాబాద్: రూ. 965.00
వరంగల్: రూ. 984.00
విశాఖపట్నం: రూ. 921.00
విజయవాడ: రూ. 937.50
గుంటూరు: రూ. 937.50

# సిల్వర్ మళ్లీ షాకిస్తోంది..



వామ్మో.. వెండి, బంగారం ధరలు మళ్లీ షాకిస్తున్నాయి. పశ్చిమాసియా యుద్ధం సమయంలో ధరలు తగ్గుముఖం పట్టాయి. అయితే కాల్పుల విరమణ దగ్గర నుంచి హెచ్చుతగ్గులు అవుతున్నాయి. నిన్న భారీగా తగ్గిన ధరలు.. ఈరోజు మాత్రం హడలెత్తిస్తున్నాయి. కిలో వెండిపై రూ. 10 వేలు పెరగగా.. తులం గోల్డ్‌పై రూ. 810 పెరిగింది. దీంతో సామాన్యులు మళ్లీ బెంబేలెత్తిపోతున్నారు. సిల్వర్ ధర మళ్లీ దూకుడు పెంచింది. ఈరోజు కిలో వెండిపై రూ. 10,000 పెరిగింది. దీంతో బులియన్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ. 2,75, 000 దగ్గర అమ్ముడవుతోంది. హైదరాబాద్, చెన్నైలో మాత్రం కిలో వెండి ధర రూ. 2,80,000 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, బెంగళూరులో మాత్రం కిలో వెండి ధర రూ. 2,75, 000 దగ్గర అమ్ముడవుతోంది. తులం గోల్డ్‌పై రూ. 810 పెరగడంతో బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 1,55,780 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ. 750 పెరగడంతో రూ. 1,42,800 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ. 610 పెరగడంతో రూ. 1,16,840 దగ్గర ట్రేడ్ అవుతోంది.

# ఉద్యోగులకు మెటా షాక్..




టెక్ రంగంలో లేఆఫ్స్ ఆగడం లేదు. మరోసారి ఉద్యోగులకు షాక్ ఇచ్చేందుకు ఫేస్‌బుక్, మెటా మాతృసంస్థ మెటా సిద్ధమైనట్లు సమాచారం. ఈ ఏడాది భారీ ఉద్యోగాల కోతల్లో మొదటి దశను మే 20న చేపట్టే అవకాశం ఉంది. ఆ తర్వాత కూడా లేఆఫ్స్ ఉంటాయని రాయిటర్స్ నివేదించింది. ఈ తొలి దశలో ప్రపంచవ్యాప్తంగా 10 శాతం ఉద్యోగాలు అంటే దాదాపుగా 8000 మంది ఉద్యోగుల్ని తొలగించనుంది. ఈ ఏడాది సెకండ్ ఆఫ్‌లో కూడా లేఆఫ్స్ ఉంటాయని కంపెనీ ఇంటర్నల్ సోర్స్‌లు చెబుతున్నాయి. అయితే, ఎంత మందిని తొలగిస్తారనే దానిపై ఇంకా స్పష్టత లేదు. ఉద్యోగాల లేఆఫ్స్‌కు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) కారణం అవుతోంది. ఏఐ సామర్థ్యాలకు అనుగుణంగా అధికారులు తమ ప్రణాళికలో మార్పులు చేసుకోవచ్చని తెలుస్తోంది. మెటా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన ఉద్యోగుల్లో 20 శాతం లేదా అంతకన్నా ఎక్కువ మందిని తొలగించే ప్లాన్ చేస్తోంది. కంపెనీ కార్యకలాపాలను పునర్నిర్మించే ప్రయత్నంలో భాగంగా ఏఐ వందల బిలియన్ డాలర్లను వెచ్చిస్తోంది. గ్లోబల్ టెక్ కంపెనీలు అన్నీ కూడా ఇలాగే లేఆఫ్స్ చేపడుతున్నాయి. ఇటీవల నెలల్లో 30,000 మంది కార్పొరేట్ ఉద్యోగుల్ని అమెజాన్ తొలగించింది. ఇది మొత్తం వర్క్‌ఫోర్స్‌లో 10 శాతం. ప్రపంచవ్యాప్తంగా టెక్ ఉద్యోగాల కోతలను పర్యవేక్షించే Layoffs.fyi ప్రకారం.. ఈ సంవత్సరం ఇప్పటివరకు 73,212 మంది ఉద్యోగులు తమ ఉద్యోగాలను కోల్పోయారని నివేదించింది. 2024లో ఈ సంఖ్య 153,000గా ఉంది.

# గోవాలో తండ్రీకొడుకుల పగ




'కేజీఎఫ్' సిరీస్‌తో భారతీయ చిత్ర పరిశ్రమను తనవైపు తిప్పుకున్న రాకింగ్ స్టార్ యశ్, తదుపరి ఏ సినిమా చేయబోతున్నారనే ఉత్కంఠకు తెరదించుతూ 'టాక్సిక్' అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. తాజాగా లాస్ వెగాస్‌లో జరిగిన సినిమాకాన్ 2026 వేదికగా యశ్ ఈ సినిమాకు సంబంధించిన కీలక విషయాలను పంచుకున్నారు. ఈ సినిమాకు 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' అనే వెరైటీ టైటిల్ పెట్టడం వెనుక ఉన్న మర్మాన్ని యశ్ వివరించారు. ఇది కేవలం గ్యాంగ్‌స్టర్ డ్రామా మాత్రమే కాదని, భావోద్వేగాలతో కూడిన ఒక తండ్రీకొడుకుల ప్రతీకార గాథ అని ఆయన స్పష్టం చేశారు. "ఇది రామాయణానికి పూర్తి భిన్నమైన ప్రపంచం. చాలా క్రూరంగా, వైల్డ్‌గా సాగే కథ ఇది" అని యశ్ పేర్కొన్నారు.సాధారణంగా గ్యాంగ్‌స్టర్ సినిమాలు ముంబై లేదా అండర్ వరల్డ్ చుట్టూ తిరుగుతుంటాయి. కానీ, యశ్ సినిమా కోసం ఈసారి గోవా చరిత్రలోని ఒక క్లిష్ట సమయాన్ని ఎంచుకున్నారు. భారతదేశానికి 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, గోవా మాత్రం 1961 వరకు పోర్చుగీస్ పాలనలోనే ఉంది. ఈ 14 ఏళ్ల పరిధిలో గోవాలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, స్మగ్లింగ్ ముఠాల అరాచకాలు, అధికార పోరాటాల చుట్టూ ఈ ఫిక్షనల్ గ్యాంగ్‌స్టర్ డ్రామాను అల్లారు. సినిమా కథ 1940ల నుండి 1970ల వరకు అంటే దాదాపు మూడు దశాబ్దాల పాటు సాగుతుంది. ఒక గ్యాంగ్‌స్టర్ సామ్రాజ్యం ఎలా పుట్టింది, ఎలా అంతమైంది అనే అంశాలను ఇందులో లోతుగా చూపించబోతున్నారు. ఈ సినిమాలో యశ్ 'రాయ' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నారు. ఆయనతో పాటు నయనతార, కియారా అద్వానీ, దిశా పటానీ, తారా సుతారియా, హుమా ఖురేషీ, రుక్మిణి వసంత్ వంటి హీరోయిన్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు.సినిమాకాన్ వేదికగా ప్రదర్శించిన 9 నిమిషాల ఎక్స్‌క్లూజివ్ ప్రివ్యూ చూసిన అంతర్జాతీయ ప్రతినిధులు సైతం యశ్ నటనకు, సినిమా మేకింగ్ స్టైల్‌కు ఫిదా అయ్యారు. హాలీవుడ్ స్థాయిలో ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# 'వారణాసి' అప్‌డేట్..!




గ్లోబల్ స్థాయిలో అంచనాలు ఉన్న రాజమౌళి-మహేశ్ బాబు ప్రాజెక్ట్ 'వారణాసి' షూటింగ్ శరవేగంగా సాగుతోంది. విభిన్న యుగాల నేపథ్యంలో సాగే ఈ అడ్వెంచర్ డ్రామాలో మహేశ్ బాబు రెండు విభిన్నమైన పాత్రల్లో కనిపించబోతున్నారు. ఒకటి శ్రీరాముడి పాత్ర కాగా, మరొకటి 'రుద్ర' అనే పవర్‌ఫుల్ పాత్ర. గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి దిగ్గజ నటులు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం, విజయేంద్ర ప్రసాద్ కథ ఈ సినిమాకు వెన్నెముకగా నిలవనున్నాయి. తాజా సమాచారం ప్రకారం,ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఒక ప్రత్యేక సెట్‌లో ఈ సినిమాకు సంబంధించి ఒక భారీ పాటను చిత్రీకరిస్తున్నారు. ఈ పాటకు బాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్ బాస్కో మార్టిన్ నృత్యరీతులు అందిస్తుండటం విశేషం. ఈ పాట చిత్రీకరణ పూర్తయిన తర్వాత చిత్ర బృందం మే నెల మొత్తం విరామం తీసుకోనుంది. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ఈ బ్రేక్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. మళ్ళీ జూన్ నెలలో కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుంది. కె.ఎల్. నారాయణ, ఎస్.ఎస్. కార్తికేయ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతోంది.




# నేను ప్రేమకు సరెండర్ అయ్యాను..

"ప్రతి ఒక్కరి జీవితంలో ఏదో ఒక సంఘటన జరుగుతూనే ఉంటుంది, దాన్ని ఎవరూ ఆపలేరు. అయితే చాలామంది ప్రేమను ఒక బలహీనతగా భావిస్తారు. కానీ నా దృష్టిలో ప్రేమ అనేది ప్రశాంతతతో కూడిన ఒక గొప్ప బలం. మనం ప్రతిరోజూ చిరునవ్వుతో నిలబడటానికి ప్రేమ ఒక శక్తిని ఇస్తుంది. నేను కూడా ఒక రోజు ప్రేమకు పూర్తిగా సరెండర్ అయ్యాను" అని రెజీనా పేర్కొన్నారు. అంతేకాకుండా, ప్రేమ విలువ గురించి చెబుతూ.. "మనం ప్రేమను పంచడానికి, పొందడానికి అర్హులమనే విషయాన్ని ఎప్పుడూ మర్చిపోకూడదు. దానిని ఏమాత్రం తక్కువగా చూడకండి. అసలు మనం ప్రేమలో ఉన్నప్పుడు పొందే ఆనందం వెనుక ఉన్న అసలు కారణం ఏంటో తెలుసా? ఆ ప్రేమను కోల్పోతే కలిగే బాధ ఏంటో మనకు ముందే తెలిసి ఉండటమే! ఆ బాధే ప్రేమ విలువను మనకు గుర్తుచేస్తూ ఉంటుంది" అని ఎంతో ఫిలాసఫికల్‌గా వివరించారు.రెజీనా ఇంత ఎమోషనల్‌గా ప్రేమ గురించి మాట్లాడటంతో నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. 'ఇదంతా మీ స్వానుభవమా రెజీనా? మళ్ళీ ప్రేమలో పడ్డారా? లేక గతంలో జరిగిన చేదు అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠమా? అంటూ సరదాగా కామెంట్స్ చేస్తున్నారు. ఆమె మాటల్లోని పరిణతి చూస్తుంటే, జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూసి ఈ స్థాయికి చేరుకున్నారని అర్థమవుతోంది. కెరీర్ పరంగా రెజీనా ఇప్పుడు గోల్డెన్ ఫేజ్ లో ఉన్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో వైవిధ్యమైన సినిమాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆమె 'ఫ్లాష్‌బ్యాక్', 'ముక్కుత్తి అమ్మన్-2' వంటి చిత్రాలతో పాటు, హిందీలో 'ది వైన్స్', 'సెక్షన్ 108' వంటి సినిమాల్లో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# 'చేతబడి' చేస్తున్న జేడీ చక్రవర్తి!




జేడీ చక్రవర్తి ప్రధాన పాత్రలో రియల్ ఇన్సిడెంట్ ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రానికి "చేతబడి" అనే టైటిల్‌ను రివీల్ చేశారు. వీ3 Media మరియు Maha Movies సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. మహర్షి కూండ్ల సమర్పిస్తున్న ఈ చిత్రానికి సూర్యాస్ రచన, దర్శకత్వం వహిస్తుండగా, మహేంద్ర నాథ్ కూండ్ల నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అచ్చు రాజమణి సంగీతం అందిస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో ప్రముఖ గీత రచయిత చంద్రబోస్ కూడా ఈ భాగమవడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సినిమాటోగ్రఫీ మిర్లాన్ నసీర్, ఎడిటింగ్ వంశీ నిర్వహిస్తున్నారు. రియల్ ఇన్సిడెంట్ ఆధారంగా బాణామతి బ్యాక్ డ్రాప్ లో రూపొందుతున్న ఈ ఆసక్తికరమైన చిత్రం హారర్, మిస్టరీ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసేలా ఉంటుంది.ఇప్పటికే విడుదలైన ప్రీ లుక్ పోస్టర్‌తో సినిమాపై ఆసక్తి పెరిగింది. గురువారం వెర్సటైల్ యాక్టర్ జేడీ చక్రవర్తి పుట్టినరోజు సందర్భంగా ఇందులో ఆయన పోషిస్తున్న పాత్ర గురించి రివీల్ చేశారు మేకర్స్. మునుపెన్నడూ పోషించని డిఫరెంట్ అవతార్‌లో హీరోగా, విలన్‌గా జేడీ చక్రవర్తి కనిపించనున్నారని యూనిట్ తెలియజేసింది. మరోవైపు ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కాకముందే.. ఐదు భాషల ఆడియో రైట్స్‌ను మ్యూజిక్ సెన్సేషన్ సరిగమ సంస్థ దక్కించుకుంది. ఒక పాటను ఐదు భాషల్లో విడుదల చేయడం కామన్‌గా జరుగుతుంది. కానీ ఇందులో తెలుగులో ఒక పాట, మిగిలిన భాషల్లో డిఫరెంట్ సాంగ్స్, సేమ్ విజువల్‌తో రావడం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. వచ్చే నెలనుంచి ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కానుంది.

# మరో రియలిస్టిక్ డ్రామాకు రంగం సిద్ధం!



తమిళ స్టార్ హీరో సూర్య, దర్శకుడు టి.జె. జ్ఞానవేల్ కాంబినేషన్‌లో వచ్చిన 'జై భీమ్' ఎలాంటి ప్రభావం చూపిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఈ క్రేజీ కాంబో మరోసారి బాక్సాఫీస్ వద్ద రచ్చ చేసేందుకు సిద్ధవ-ువుతోంది. వీరిద్దరూ కలిసి మరో పవర్‌ఫుల్ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించబోతున్నట్లు సమాచారం. ఈ సినిమా కూడా ఒక యథార్థ సంఘటన ఆధారంగా సాగే ఇంటెన్స్ డ్రామా అని తెలుస్తోంది.సూపర్ స్టార్ రజనీకాంత్‌తో తీసిన 'వెట్టయాన్' ఆశించిన స్థాయిలో సక్సెస్ కాకపోవడంతో, జ్ఞానవేల్ తన తదుపరి చిత్రంపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ తుది దశలో ఉంది. సూర్య తన సొంత నిర్మాణ సంస్థ 'జగరం స్టూడియోస్'పై ఈ చిత్రాన్ని నిర్మించబోతున్నారు. 'జై భీమ్' లాగే ఈ సినిమా కూడా సామాజికో సమస్యల చుట్టూ తిరుగుతూనే, కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఉండబోతోందని టాక్. ప్రస్తుతం సూర్య కెరీర్‌లో వరుస ప్రాజెక్టట్ లతో బిజీ ఫేజ్‌లో ఉన్నారు. ఇందులో 'కరుప్పు' (వీరభద్రుడు) మే 14న విడుదల కాబోతుంది. అలాగే 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఈ సినిమా కూడా షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. Suriya#47 'ఆవేశం' ఫేమ్ జిత్తు మాధవన్ దర్శకత్వంలో షూటింగ్ జరుగుతోంది. కాగా ఈ మూడు సినిమాల తర్వాతే జ్ఞానవేల్ ప్రాజెక్ట్ ప్రారంభం కానుంది. కేవలం మూడు నెలల వ్యవధిలో సూర్య నుండి రెండు సినిమాలు రాబోతుండటంతో బాక్సాఫీస్ వద్ద 'సూర్య ప్రభంజనం' ఖాయమనిపిస్తోంది.

# గ్రోత్ హార్మోన్ రూమర్లపై క్లారిటీ ఇచ్చిన హన్సిక




అందాల ముద్దుగుమ్మ హన్సిక గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. హిందీ సినిమాల ద్వారా సినిమా పరిశ్రమలోకి తెరంగేట్రం చేసిన ఈ నటి, దేశముదురు చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయం అయింది. ఈ సినిమాలో అల్లు అర్జున్ హీరోగా నటించగా, పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా మంచి విజయం సాధించడం, ఇందులో ఈమె తన నటనతో, అందాలతో ప్రేక్షకులను కట్టిపడేయడంతో ఈ మూవీ ద్వారా ఈ హీరోయిన్‌కు మంచి గుర్తింపు వచ్చింది. దాని తర్వాత ఈమెకు తెలుగులో అనేక చిత్రాల్లో అవకాశాలు దక్కాయి. చాలా కాలం పాటు ఈమె తెలుగు తెరపై తిరుగులేని నటిగా కొనసాగింది. ఆ తర్వాత ఈ బ్యూటీ తమిళంలో కూడా స్టార్ హీరోయిన్‌గా అనేక సంవత్సరాలు కెరీర్‌ను ముందుకు సాగించింది.ఇకపోతే దేశముదురు సినిమా సమయంలో హన్సికపై గ్రోత్ హార్మోన్‌కు సంబంధించిన పలు రూమర్లు వచ్చిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఈ వార్తలు ఇండస్ట్రీలోనే కాకుండా ప్రేక్షకుల్లో కూడా పెద్ద చర్చకు దారితీశాయి. ఎట్టకేలకు ఇటీవల ఈ విషయంపై స్పందించిన హన్సిక, ఆ రూమర్లన్నింటినీ పూర్తిగా ఖండించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... "అది అంతా అర్థంలేని ప్రచారం. మీడియా వాళ్లు క్లిక్‌బైట్ కోసం ఏదైనా సృష్టించగలరు" అని తెలిపింది. ఇక తనకు ఇప్పటికీ ఇంజెక్షన్ అంటే చాలా భయం అని, అలాగే "నాకు ఇప్పటికీ ఇంజెక్షన్ వేస్తే, ఆ మందు పూర్తిగా అయిపోయే వరకు ఏడుస్తూనే ఉంటాను" అని ఆమె చెప్పుకొచ్చింది. ఇలా హన్సిక అప్పటి రూమర్లకు ఇప్పుడు ఫుల్‌స్టాప్ పెట్టేసింది.




# తొందరపడే ప్రసక్తే లేదు!

సాధారణంగా భారీ బడ్జెట్ సినిమాలకు షూటింగ్ దశలోనే థియేట్రికల్, నాన్-థియేట్రికల్ డీల్స్ క్లోజ్ అయిపోతుంటాయి కానీ 'స్పిరిట్' టీమ్ మాత్రం ఇందుకు భిన్నంగా వెళ్తోంది. ప్రస్తుతం ఈ సినిమాకు ఎలాంటి ఎక్స్టర్నల్ ఫైనాన్షియల్ బ్యాకింగ్ అవసరం లేదని సమాచారం. దీంతో నిర్మాతలు T-Seriesతో పాటు ప్రభాస్, సందీప్ వంగా ముగ్గురూ కలిసి ఒక కీలక నిర్ణయానికి వచ్చారు. డిజిటల్, శాటిలైట్ సహా ఇతర నాన్-థియేట్రికల్ హక్కులను ఇప్పుడే అమ్మకూడదని వారు గట్టిగా ఫిక్స్ అయ్యారు. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వంటి దిగ్గజ ఓటిటి ప్లాట్‌ఫారమ్‌లు ఇప్పటికే భారీ ఆఫర్లతో మేకర్స్‌ని సంప్రదించినట్లు తెలుస్తోంది. సినిమా క్రేజ్ దృష్ట్యా రికార్డు స్థాయి ధరలను ఆఫర్ చేసినప్పటికీ, టీమ్ మాత్రం ససేమిరా అంటోంది.సందీప్ రెడ్డి వంగా గత చిత్రం 'యానిమల్' సృష్టించిన సంచలనం అందరికీ తెలిసిందే. ఇప్పుడు ప్రభాస్‌తో కలిసి ఆయన చేస్తున్న ఈ 'పోలీస్ డ్రామా'పై మార్కెట్‌లో విపరీతమైన హైప్ ఉంది. ఈ ఏడాది చివరలో సినిమా ఒక కొలిక్కి వచ్చిన తర్వాతే, మార్కెట్ వాల్యూ మరింత పెరుగుతుందని మేకర్స్ భావిస్తున్నారు. అప్పుడే డీల్స్ క్లోజ్ చేస్తే ఊహించని రేంజ్ బిజినెస్ జరుగుతుందని వారి ప్లాన్. ప్రస్తుతానికి 'స్పిరిట్' మేకర్స్ దృష్టంతా అవుట్‌పుట్ మీద మాత్రమే ఉంది. ఈ ఏడాది ఆఖరి వరకు ఎలాంటి బిజినెస్ డీల్స్ ఉండకపోవచ్చని స్పష్టమవుతోంది.

అంటే, ప్రభాస్ ఫ్యాన్స్ ఈ భారీ ప్రాజెక్ట్ అప్‌డేట్స్ కోసం మరికొంత కాలం వేచి చూడాల్సిందే. ఒకవేళ డీల్స్ గనుక ఓపెన్ అయితే మాత్రం, ఇండియన్ సినిమా హిస్టరీలోనే అది ఒక సరికొత్త రికార్డు కావడం ఖాయం.

# కొత్త అందాన్ని తీసుకొచ్చిన యంగ్ బ్యూటీ




యంగ్ హీరోయిన్ రుక్మిణి వసంత్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈమె 'సప్త సాగరాలు దాటి సైడ్ ఎ', 'సప్త సాగరాలు దాటి సైడ్ బి' చిత్రాల ద్వారా మంచి గుర్తింపును సంపాదించుకుంది. ఆ తర్వాత ఈమెకు వరుసగా అనేక చిత్రాల్లో అవకాశాలు రావడం ప్రారంభమైంది.కొంతకాలం క్రితం 'కాంతార చాప్టర్ 1' అనే సినిమాలో హీరోయిన్ గా నటించింది. ఇందులో ఈమె తన నటనతో పాటు అందాలతో కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ బ్యూటీ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంలో హీరోయిన్ గా నటిస్తోంది.ఈ మూవీపై ఇండియా వ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇది ఇలా ఉంటే, ఈ బ్యూటీ ఈ మధ్యకాలంలో ఏదైనా ఈవెంట్ కు వెళ్లినప్పుడు సూపర్ స్టైలిష్ లుక్ లో ఉన్న డ్రెస్ లు వేసుకొని వెళ్తోంది.దాంతో ఈమె ఆ ఈవెంట్ కు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. తాజాగా INCA అవార్డ్స్ వేడుక ఎంతో గ్రాండ్ గా జరిగింది. దీనికి రుక్మిణి కూడా విచ్చేసింది. ఇక ఈ ఈవెంట్ కు ఈమె అల్ట్రా స్టైలిష్ లుక్ ఉన్న స్లీవ్ లెస్ సిల్వర్ కలర్ డ్రెస్ ను వేసుకొని వచ్చింది.అలాగే ఈమె ఈ డ్రెస్ లో అదిరిపోయే యాంగిల్స్ లో ఫోటోలకు స్టిల్స్ కూడా ఇచ్చింది. ఇందులో ఈమె ఎంతో అందంగా కనిపించడంతో ఈ ఫోటోలు పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**